మదనపల్లెలో స్వీప్ కార్యక్రమం అవగాహన ర్యాలీలో కలెక్టర్, ఎస్పీ, అధికారులు



ప్రపంచంలోనే పెద్ద కార్యక్రమం

భారతదేశ ఎన్నికల నిర్వహణ

- 10 కోట్ల మంది ఎన్నికల విధుల్లో
- కలెక్టర్ ఆధ్వర్యంలో స్వీప్ అవగాహన ర్యాలీ

మదనపల్లె టౌన్, ఏప్రిల్ 4: ప్రపంచంలోనే అతి పెద్ద కార్యక్రమం భారతదేశంలో నిర్వహించే సార్వత్రిక ఎన్నికలు అని కలెక్టర్, ఎన్నికల అధికారి అభిషిక్త్ కిశోర్ తెలిపారు. గురువారం మదనపల్లెలో కలెక్టర్ ఆధ్వర్యంలో ఎస్వీఈఈపీ (సిస్టమ్యాటిక్ ఓటర్ ఎడ్యుకేషన్ అండ్ ఎన్‌రోల్‌మెంట్ ప్రోగ్రాం) అనే కార్యక్రమంలో ప్రజలకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. స్థానిక సబ్ కలెక్టరేట్ వద్ద కలెక్టర్ అభిషిక్త్ కిశోర్, ఎస్పీ కృష్ణారావు స్వీప్ ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. ర్యాలీ చిత్తూరు బస్టాండు మీదుగా సీటీఎం రోడ్డు మీదుగా టూటౌన్ పోలీసుస్టేషన్ వద్ద ఏర్పాటు చేసిన వేదిక వద్దకు చేరుకుంది. ఈ సందర్భంగా కలెక్టర్, ఎస్పీ, ఆర్డీవో చేతుల మీదుగా పావురాలు ఎగురవేసి మువ్వన్నెల బెలూన్లను గాలిలోకి వదిలారు. కలెక్టర్ మాట్లాడుతూ దేశంలో నిర్వహిస్తున్న సార్వత్రిక ఎన్నికలు ప్రపంచంలోనే పెద్ద కార్యక్రమం అని, సుమారు 10 కోట్ల మంది అధికారులు ఎన్నికల విధుల్లో పాల్గొంటున్నారన్నారు. ఇలాంటి బృహత్తర కార్యక్రమంలో తమ వంతు పాత్రగా 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు కావాలని, అంతేకాకుండా ప్రతి ఒక్కరూ మే 13వ తేదీ నిర్వహించే ఎన్నికల్లో ఓటుహక్కు వినియోగించుకుని ప్రజాస్వామ్యంలో పాలుపంచుకోవాలన్నారు. నేడు నిర్వహించిన స్వీప్ ర్యాలీ అధికారులపై ఒత్తిడి తగ్గిస్తుందన్నారు. ఎస్పీ కృష్ణారావు మాట్లాడుతూ ఓటర్లు ఎలాంటి ప్రలోభాలు, ఒత్తిళ్లకు తలొగ్గకుండా స్వచ్ఛందంగా, స్వతంత్రంగా ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. జాతీయ హాకీ జట్టు సభ్యుడు హితేష్ మాట్లాడుతూ నేటి యువత ఓటు హక్కు వినియోగించుకోవడంలో ఆదర్శంగా నిలవాలన్నారు. అనంతరం విద్యార్థులు మానవహారంగా ఏర్పడగా, ఓటుహక్కు వినియోగంపై అందరి చేత ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఆర్డీవో హరిప్రసాద్, నోడల్ అధికారి రాజశేఖర్, డీఎస్పీ ప్రసాద్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ ప్రమీల, సీఐలు యువరాజు, వల్లీబసు, శేఖర్, తహసీల్దార్ రమాదేవి, ఎంఈవో ప్రభాకర్‌రెడ్డి, ఎన్‌సీసీ విద్యార్థులు పాల్గొన్నారు.

పాళెంకొండ అడవిలో చిరుతలు

- తాగునీటి కోసం అడవి దాటిన చిరుత కూన
- వీడియో తీసిన టిప్పర్ డ్రైవర్



పాళెంకొండ పక్కన జాతీయ రహదారి పనుల వద్ద బండల మధ్యలో నక్కిన చిరుత కూన

మదనపల్లె టౌన్, ఏప్రిల్ 4: మదనపల్లె మండలం పాళెంకొండ అడవిలో చిరుతల సంచారం ఉన్నట్లు ఆనవాళ్లు బయటపడుతున్నాయి. గురువారం ఉదయం పాళెంకొండ దిగువన నిర్మిస్తున్న నాలుగు లేన్ల జాతీయ రహదారి నిర్మాణంలో ఉన్న కార్మికులకు చిరుత కూన కనపడింది. మట్టి టిప్పర్ నడుపుతున్న డ్రైవర్‌కు బండల మధ్య చిరుత కూన కనపడంతో వీడియో తీశాడు. ఈ వీడియో వైరల్‌గా మారడంతో మదనపల్లె ఎఫ్ఆర్‌వో మదనమోహన్‌రెడ్డి అప్రమత్తమయ్యారు. హార్సిలీహిల్స్ అడవులకే పరిమితమైన నాలుగు చిరుతల సంచారం మదనపల్లె, వాల్మీకిపురం, నిమ్మనపల్లె మండలాల్లో 4 వేల హెక్టార్లలో విస్తరించిన నూరుకుప్పల కొండ అడవులకు వ్యాపించడం గమనార్హం. ఈ నూరుకుప్పలకొండ నాలుగు కంపార్టుమెంట్లుగా, మూడు అటవీ సెక్షన్లుగా విభజన చేసి అటవీ అధికారులు పర్యవేక్షిస్తున్నారు. ఇలాంటి తరుణంలో నూరుకుప్పల కొండ అడవుల్లో ఇటీవల కొందరు అడవులకు నిప్పు పెడుతుండటంతో అక్కడి జంతువులు వాటి ఆవాసాలను మారుస్తున్నాయి. ఈ క్రమంలో పాళెంకొండ అడవి నుంచి చిరుత కూన జాతీయరహదారి పక్కన వేసిన బండరాళ్ల మధ్య సంచరించడం టిప్పర్ డ్రైవర్ వీడియో తీశాడు. అడవిలో తాగునీరు లేక అడవి దాటి కిందికి వచ్చి ఉంటుందని ఎఫ్ఆర్‌వో అభిప్రాయపడ్డారు. నూరుకుప్పల కొండ అడవి విస్తారంగా ఉండటంతో, ఇక్కడ అడవి జంతువులు పెరిగాయని, అందులో చిరుతలు కూడా ఉండవచ్చని తెలిపారు. ఈ అడవి కింద ఉన్న అబ్బిగొంది, గాజులవారిపల్లె, అండేవారిపల్లె, పాళెంకొండ, రాచవేటివారిపల్లె, బాహాదాప్రాజెక్టు, పత్తేపురం, ఎర్రప్పగారిపల్లె, ముష్టూరు గ్రామాల ప్రజలను అప్రమత్తం చేస్తామన్నారు. రాత్రిళ్లు అడవుల్లోకి వేటకు వెళ్లవద్దని, అలాగే చిరుతల సంచారం ఉన్నట్లు తెలిస్తే తమకు సమాచారం ఇవ్వాలని ఎఫ్ఆర్‌వో కోరారు. వాల్మీకిపురం, నిమ్మనపల్లె ఎఫ్ఎస్‌వోలు చిరుతకూన సంచరించిన ప్రాంతానికి వెళ్లి చిరుతకూన పాదముద్రలు సేకరించారు. రాత్రి అటవీ పరిసర గ్రామాల్లోనే ఉండి గ్రామస్థులను అప్రమత్తం చేస్తున్నట్లు ఎఫ్ఆర్‌వో తెలిపారు.

బెడిసికొట్టిన వైసీపీ వ్యూహం

- గురువారం ఉదయం నుంచే సచివాలయాల్లో పెన్షన్ పంపిణీ
- జిల్లా వ్యాప్తంగా 90 శాతం పూర్తి
- వలంటీర్లు లేకుండానే పని పూర్తి చేసిన సచివాలయ సిబ్బంది



బి.కొత్తకోటలోని గట్టు గ్రామ సచివాలయం వద్ద లబ్ధిదారులకు పెన్షన్ పంపిణీ

(రాయచోటి-ఆంధ్రజ్యోతి): వెనుకటి కొకడు పెళ్లిలో గుండ్రాయి దాచిపెట్టాడంట.. ఎందుకురా గుండ్రాయిని దాచిపెట్టావు అంటే.. గుండ్రాయి లేకుంటే.. పెళ్లికొడుకు కొబ్బరికాయ కొట్టలేడు కదా.. పెళ్లి ఆగిపోతుంది.. అన్నాడంట.. అచ్చం ఇలాగే ఉంది ప్రస్తుతం పెన్షన్ల పంపిణీలో అధికార వైసీపీ ఆడుతున్న హైడ్రామా. వలంటీర్లు లేకపోతే పెన్షన్లు ఇవ్వాలంటే.. కనీసం వారం నుంచి పది రోజులు పడుతుందని రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులే పేర్కొన్నారు. అసలు వలంటీర్ వ్యవస్థ లేకపోతే రాష్ట్ర ప్రభుత్వం నడవడమే కష్టమనే రీతిలో ప్రభుత్వ పెద్దలు, వైసీపీ నాయకులు కలరింగ్ ఇచ్చారు. వలంటీర్లు ఎంతో నిబద్ధతతో పనిచేస్తుంటే ప్రతిపక్షాలు ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసి వలంటీర్లను పెన్షన్ల పంపిణీ బాధ్యతల నుంచి తప్పించారని, దీనికంతటికీ కారణం తెలుగుదేశం పార్టీనే అని బురదజల్లే పనిని వైసీపీ చేపట్టింది. అయితే గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బందితో పెన్షన్ల పంపిణీ చేపట్టమని ఎన్నికల సంఘం ఆదేశించింది. దీంతో బుధ, గురువారాల్లో సచివాలయ సిబ్బంది జిల్లాలో సుమారు 90 శాతం పెన్షన్లను పంపిణీ చేశారు. ఇక మిగిలిన పది శాతం కూడా శుక్రవారం పంపిణీ పూర్తి కావచ్చు. దీంతో అధికార పార్టీ వ్యూహం బెడిసికొట్టిందే..అంటూ పలువురు పేర్కొంటున్నారు.

డబ్బు సర్దలేక.. ప్రతిపక్షాలపై ఏడుపు

ప్రతి నెలా 30 లేదా 31 నాటికి పెన్షన్ల కోసం రాష్ట్ర ప్రభుత్వం బ్యాంకులో డబ్బు జమ చేయాలి. ఈ డబ్బును అధికారులు బ్యాంకుల నుంచి తెచ్చి వలంటీర్ల చేతికి ఇచ్చేవాళ్లు. వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు పెన్షన్ అందించే వాళ్లు. ఇదంతా ఒక రోజులో జరగడం దాదాపు జరిగేది కాదు. ఒకటి రెండురోజుల పాటు వలంటీర్లు పంపిణీ చేసి సుమారు 99 శాతం లబ్ధిదారులకు ఇచ్చేవాళ్లు. అయితే మార్చి 31 ఆదివారం, ఏప్రిల్ 1, 2 తేదీలు వరసగా సెలవులు వచ్చాయి. దీంతో ఈసారి పెన్షన్లు ఏప్రిల్ 3వ తేదీ నుంచి పంపిణీ చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం తమ అనుకూల మీడియాలో వారం రోజుల ముందుగానే వార్తలు రాయిచింది. వాస్తవానికి రాష్ట్ర ప్రభుత్వానికి పెన్షన్ లబ్ధిదారులపై అంత ప్రేమే ఉంటే గతనెల 30వ తేదీకి ముందే బ్యాంకుల్లో డబ్బు జమ చేసి ఉండాల్సింది. అప్పులతో ఏ పూటకు ఆ పూట పాలన చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం దీనిపైన అసలు దృష్టే పెట్టలేదు. ఇదే సమయంలో రాష్ట్ర ప్రభుత్వం ఊహించని విధంగా వలంటీర్లను రాష్ట్ర ప్రభుత్వం దుర్వినియోగం చేస్తున్న విషయమై ఒక స్వచ్ఛంద సంస్థ కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసింది. ఎన్నికల సంఘం వలంటీర్లను ఎన్నికల విధులతో పాటు పెన్షన్ల పంపిణీ వంటి ఇతర సంక్షేమ పథకాల అమలుకు దూరంగా ఉంచాలని మార్చి 30వ తేదీ నాటికి ఆదేశాలు ఇచ్చింది. సచివాలయ సిబ్బందితో సచివాలయాల వద్ద పెన్షన్లను పంపిణీ చేయాలని ఆదేశించింది. ఊహించని ఈ పరిణామానికి ఖంగుతిన్న అధికార పార్టీ పెన్షన్లను ఇంటింటికీ ఇవ్వలేకపోవడానికి కారణం తెలుగుదేశం పార్టీనే అని ప్రచారానికి శ్రీకారం చుట్టింది. తమ స్వార్థం కోసం అధికార పార్టీ బుధవారం జిల్లా వ్యాప్తంగా వృద్ధులను ఎండలో సచివాలయాల వద్దకు వెళ్లేలా మోసపుమాటలు చెప్పింది. అయితే బ్యాంకు పనివేళలు మొదలైన తర్వాత అధికారులు డబ్బు తెచ్చి పెన్షన్‌ను లబ్ధిదారులు పంపిణీ చేశారు. బుధవారం సాయంత్రానికి సుమారు 21 శాతం మాత్రమే పంపిణీ చేయగా గురువారం నాటికి దాదాపు 90 శాతం పూర్తయింది.

వృద్ధాప్య పెన్షన్లే అధికం

జిల్లాలో సామాజిక పెన్షన్లు 2,25,131 ఉన్నాయి. ఇందులో అధికభాగం 1,31,793 వృద్ధాప్య పెన్షన్లు ఉన్నాయి. వితంతు పెన్షన్లు 46,289, వికలాంగ పెన్షన్లు 27,109, అభయహస్తం పెన్షన్లు 5757 ఉన్నాయి. వీటి కోసం నెలకు రూ.67,31,43,500 కోట్లు పంపిణీ చేయాలి. వైసీపీ ప్రభుత్వం ప్రతి 50 ఇళ్లకు ఒక వలంటీర్‌ను నియమించింది. వీళ్లతో నవరత్నాల సంక్షేమ పథకాలను అమలు చేస్తోంది. ప్రతి నెలా వలంటీర్లు పెన్షన్లను లబ్ధిదారులకు పంపిణీ చేసే వాళ్లు. అయితే ఈ పథకాలను లబ్ధిదారులకు అందించే పనితో పాటు ప్రతి ఇంట్లో ఎంత మంది ఉన్నారు? వాళ్లు ఏం చేస్తారు? వాళ్లకు ఆస్తులు ఎన్ని ఉన్నాయి. వాళ్లు ఏ పార్టీ మద్దతుదారులు అనే సమాచారాన్ని కూడా రాష్ట్ర ప్రభుత్వానికి చేరవేశారు. దీంతో వలంటీర్లను అడ్డం పెట్టుకుని రాబోయే ఎన్నికల్లో గెలిచేందుకు ఓటర్లను ప్రలోభపెడుదోందని ఆధారాలతో కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదులు వెళ్లాయి. దీంతో ఎన్నికల సంఘం వలంటీర్లపై కొరడా ఝులిపించింది. ఎన్నికల విధులతో పాటు, సంక్షేమ పథకాల అమలు బాధ్యత కూడా వలంటీర్లకు ఇవ్వకూడదని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది. ఈ ఆదేశాలతో నోట్లో పచ్చి వెలక్కాయపడ్డట్లు ఇబ్బంది పడ్డ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపక్షాలపై ఎదురు దాడి మొదలు పెట్టింది. ఇంతలోనే ఏప్రిల్ నెలలో పెన్షన్లు ఇవ్వాల్సి రావడాన్ని తమకు అనుకూలంగా మార్చుకునేందుకు కుట్రలు చేసింది. రాష్ట్ర ముఖ్యమంత్రే ఎన్నికల సంఘం విశ్వసనీయత, నిబద్ధతపై అనుమానాలు కలిగే విధంగా వలంటీర్లను వెనుకేసుకు వస్తున్నాడు. వలంటీర్లు ఉండి ఉంటే ఈసారీ ఇంటి వద్దకే లబ్ధిదారులకు పెన్షన్లు అందేవని అబద్ధాలు చెబుతుండటంతో వైసీపీకి చెందిన నాయకులు, కార్యకర్తలు చెలరేగిపోయారు. కేవలం తెలుగుదేశం పార్టీ వల్లే లబ్ధిదారులకు పెన్షన్ ఇవ్వలేకపోయారనే దుష్ప్రచారానికి తెరలేపారు.

90 శాతం లబ్ధిదారులకు పంపిణీ

జిల్లాలోని 501 గ్రామ, వార్డు సచివాలయాల్లో పని చేసే సిబ్బంది బుధ, గురువారాల్లో జిల్లాలో సుమారు 90 శాతం వరకు లబ్ధిదారులకు పెన్షన్ పంపిణీ చేశారు. మొదటి రోజు బ్యాంకుల నుంచి డబ్బు రావడానికే ఆలస్యం కావడంతో పంపిణీ కూడా ఆలస్యంగానే మొదలైంది. అయితే గురువారం ఉదయం నుంచే పంపిణీ మొదలైంది. దీంతో గురువారం సాయంత్రం 5 గంటలకు దాదాపుగా 90 శాతం పూర్తి అయినట్లేనని అధికారులు పేర్కొంటున్నారు. ఇందులో గరిష్టంగా రాజంపేట మునిసిపాలిటీలో 3342 పెన్షన్లకు గానూ..3159 మందికి 94.52 శాతం, రాయచోటి మున్సిపాలిటీలో 8531 పెన్షన్లకు గానూ 8056 మందికి 94.43 శాతం పంపిణీ చేశారు. కనిష్టంగా వీరబల్లిలో 5448 మంది లబ్ధిదారులకు గానూ.4082 మందికి 74.93 శాతం పంపిణీ చేశారు. కాగా శుక్రవారానికి మిగిలిన పది శాతం పూర్తి కావచ్చని అధికారులు పేర్కొన్నారు. పెన్షన్ల పంపిణీలో అధికార పార్టీ చేసిన హంగామా చూసిన వాళ్లందరూ.. ఔరా.. మొగుణ్ని కొట్టి.. మొగసాలకెక్కడం అంటే ఇదే కాబోలు అంటూ ముక్కున వేలేసుకుంటున్నారు.

పకడ్బందీగా పాలిసెట్ నిర్వహణ : డీఆర్‌వో

రాయచోటి (కలెక్టరేట్), ఏప్రిల్ 4: జిల్లాలో ఈనెల 27వ తేదీ నిర్వహించే పాలిసెట్ చాలా పకడ్బందీగా నిర్వహించాలని విద్యాశాఖాధికారులను డీఆర్‌వో సత్యనారాయణ ఆదేశించారు. గురువారం తన చాంబర్‌లో పాలిటెక్నిక్ పరీక్ష విధి విధానాలపైన చర్చించారు. అన్ని శాఖల వారి సమన్వయంతో పాలిసెట్ విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని రకాల చర్యలు తీసుకోవాలని వారు సూచించారు. రాయచోటి, మదనపల్లె, రాజంపేట, కలికిరి ప్రాంతాల్లో పరీక్ష రోజులు జిరాక్స్ సెంటర్లు మూసే విధంగా అధికారులు అన్ని రకాల చర్యలు తీసుకోవాలని వారు ఆదేశించారు. రాయచోటిలో మొట్టమొదటిసారిగా పాలిసెట్ పరీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్‌లు, విద్యాశాఖ, అధికారులు పాల్గొన్నారు.

ప్రతి పాఠశాలలో వాటర్ బెల్ మోగించండి : డీఈవో

రాయచోటిటౌన్, ఏప్రిల్ 4: రాష్ట్రవ్యాప్తంగా మండుతున్న ఎండలను దృష్టిలో పెట్టుకుని విద్యాశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు జిల్లా పరిధిలోని పాఠశాలల్లో వాటల్ బెల్ మోగించాలని జిల్లా విద్యాశాఖ అధికారి శిప్రకాశ్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రెండు, మూడు రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా ఎండలు మండుతుండడంతో పాఠశాలలకు వచ్చే పిల్లలకు వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవడంలో భాగంగా ప్రభుత్వ, ప్రైవేటు అన్ని యాజమాన్య పాఠశాలల్లో ఉదయం 8.45 గంటలకు, 10.05 గంటలకు, 11.05 గంటలకు రోజుకు మూడుసార్లు వాటర్ బెల్ మోగించి విద్యార్థుల చేత నీటిని తాగించాలని ఆయన సూచించారు. అధిక ఉష్ణోగ్రతల దృష్ట్యా విద్యార్థుల్లో మానసిక, శారీరక ఆరోగ్యాన్ని కాపాడేందుకు విద్యాశాఖ ఈ నిర్ణయం తీసుకుందన్నారు.

కూటమి యుద్ధం.. వైసీపీ ఓటమి ఖాయం

- జగన్ అరాచక పాలనను అంతం చేస్తాం
- జగన్‌మోహన్‌రాజు, ముక్కా రూపానందరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ ఇన్‌చార్జ్ ముక్కా రూపానందరెడ్డి

రైల్వేకోడూరు, ఏప్రిల్ 4: టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి యుద్ధంతో వైసీపీ ఓటమి ఖాయమని టీడీపీ రైల్వేకోడూరు ఇన్‌చార్జ్ ముక్కా రూపానందరెడ్డి, రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు చమర్తి జగన్మోహన్‌రాజు తెలిపారు. గురువారం రైల్వేకోడూరులోని విజయ కన్వెన్షన్ హాలులో కూటమి ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసీపీ అరాచకపాలనను అంతం చేయాలని కార్యకర్తలు, నాయకులకు పిలుపు నిచ్చారు. రైల్వేకోడూరులో జనసేన పార్టీ తరపున టిక్కెట్‌ను అరవ శ్రీధర్‌కు ఇచ్చారని ఒక్క ఛాన్సు ప్రజలు ఇస్తే రైల్వేకోడూరును అభివృద్ధి చేసుకునేందుకు వీలు ఉంటుందన్నారు. రాజంపేట బీజేపీ ఎంపీ అభ్యర్థిగా నిలిచిన నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డిని గెలిపిస్తే కేంద్రం నుంచి నిధులు తెప్పించి రైల్వేకోడూరును అన్ని రంగాల్లో అభివృద్ధి చేసుకునే అవకాశాలు ఉన్నాయన్నారు. రైల్వేకోడూరులో బస్టాండు, మెడికల్ కాలేజి లేదన్నారు. వాటి కోసం తాము ముమ్మరంగా ప్రయత్నించి తెస్తామన్నారు. రైల్వేకోడూరులో జనసేన పార్టీ అభ్యర్థి గెలిపిస్తే ఆంధ్ర రాష్ట్రం లోనే నెంబర్-1 గా నిలబెడతామన్నారు. మంగంపేట బెరైటీస్ గనుల్లో ఏమి జరిగిందో ఎంత దోపీడి చేశారో వాటిని అంతా కక్కిస్తామన్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే ఎర్రచందనం దొంగలను పట్టుకుంటామని వారి అంతు తేల్చుతామన్నారు. పార్టీ పరిశీలకుడు హేమాంబరధరరావు మాట్లాడుతూ కోడూరులో పూర్వవైభవం తీసుకుని రావాలన్నారు. కూటమి అభ్యర్థి అరవ శ్రీధర్‌ను గెలిపించి చంద్రబాబు, పవన్‌కళ్యాణ్, నరేంద్రమోదీలకు బహుమతిగా ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాతంశెట్టి నాగేంద్ర, సీనియర్ నాయకుడు కట్టా గుండయ్యానాయుడు, సీనియర్ బీసీ నాయకుడు మలిశెట్టి మురళీధర్‌గౌడు, టీడీపీ యువ నాయకుడు ముక్కా సాయివికాస్‌రెడ్డి, జనసేన సీనియర్ నాయకుడు ముఖరంచాంద్, పగడాల వెంకటేష్, జోగినేని మణి, పగడాల చంద్రశేఖర్, కొక్కంటి మహేష్, దాసరి వీరేంద్ర, టీడీపీ సీనియర్ నాయకులు వాసు దేవరెడ్డి, కల్లా చలపతి, అనుముల గుండం చంద్రమోహన్, గునిపాటి కిరణ్, గునిపాటి రాయుడు, లారీ సుబ్బరాయుడు, సుబ్బరాయుడునాయుడు, మహిళా నాయకురాళ్లు ముక్కా వరలక్ష్మీ, దుద్యాల అనితాదీప్తి, మెహతాజ్, పుష్పలత, కారుమంచి సంయుక్త, వైజయంతిమాల తదితరులు పాల్గొన్నారు.

రైల్వేకోడూరు జనసేన అభ్యర్థిగా అరవ శ్రీధర్



రైల్వేకోడూరు, ఏప్రిల్ 4: రైల్వేకోడూరు జనసేన పార్టీ టిక్కెట్టును ఓబులవారిపల్లె మండలంలోని ముక్కావారిపల్లె సర్పంచ్ అరవ శ్రీధర్‌కు కేటాయిస్తూ జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ గురువారం ప్రకటన విడుదల చేశారు. ఇటీవల పెనగలూరు మండలంలోని నరసింగరాజపురానికి చెందిన యనమల భాస్కర్‌రావుకు టిక్కెట్టు కేటాయించిన విషయం తెలిసిందే. కొన్ని కారణాలతో టిక్కెట్టు మార్చి అరవ శ్రీధర్‌కు కేటాయించారు. అరవ శ్రీధర్ ముక్కావారిపల్లెకు సర్పంచ్‌గా పని చేస్తున్నారు. ఆయన బీటెక్ చదువుకున్నారు. ఎస్సీ మాల సామాజికవర్గానికి చెందిన ఆయన స్వగ్రామం ముక్కావారిపల్లె దళితవాడ. తల్లి ప్రమీల, తండ్రి వెంకటయ్య చియ్యవరం వీఆర్‌వోగా పనిచేస్తున్నారు.

నీటి సమస్య తలెత్తకుండా చూడాలి : కలెక్టర్

తంబళ్లపల్లె, ఏప్రిల్ 4: వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టాలని కలెక్టర్ అభిషిక్త్ కిశోర్ అధికారులను ఆదేశించారు. తంబళ్లపల్లె మండలం ఎర్రసానిపల్లె పంచాయతీ వక్కావాండ్లపల్లెలో తాగునీటి సమస్య ఏర్పడటంతో ట్యాంకరు ద్వారా నీటిని సరఫరా చేసేందుకు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు జిల్లా ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపారు. ఈ విషయమై గురువారం కలెక్టరు వక్కావాండ్లపల్లెను సందర్శించారు. గ్రామంలో ఉన్న తాగునీటి బోరులో వస్తున్న నీటిని పరిశీలించి నీటి సమస్యపై స్థానికులు, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ వేసవికాలంలో నీటి సమస్య తలెత్తకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. గ్రామంలో నీటి సమస్య పరిష్కారానికి ఎస్‌డీఆర్ఎఫ్ నిధులతో ప్రతిరోజూ ఒక ట్యాంకరు చొప్పున నీటిని సరఫరా చేసేందుకు వెంటనే నివేదికలు పంపాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. గ్రామంలో దాదాపు 33 కుటుంబాలతో పాటు పశువులు, గొర్రెలు, మేకలు ఉన్నాయని ఇక్కడ నీటి సమస్య పరిష్కరించేందుకు వెంటనే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలన్నారు. ముఖ్యంగా ఏప్రిల్, మే, జూన్ నెలల్లో గ్రామాల్లో ఎక్కడా నీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అదేవిధంగా తాగునీరు వృథా చేయకుండా ప్రజలలో అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం గ్రామంలో పెన్షన్‌దారులు ఎంతమంది ఉన్నారు.. పెన్షన్ ఎలా అందుతోందని లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. కలెక్టరు వెంట ఆర్డీవో హరిప్రసాద్, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ రషీద్‌ఖాన్, హౌసింగ్ డీఈ శ్రీనివాసులు, ఈఆర్వో రాఘవేంద్ర, తహసీల్దారు బ్రహ్మయ్య, ఎంపీడీవో క్రిష్ణమూర్తి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అశోక్‌కుమార్, కార్యదర్శి రఘునాథ్, మండల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన ఇంటర్మీడియట్ మూల్యాంకనం

రాయచోటిటౌన్, ఏప్రిల్ 4: రాయచోటి పట్టణంలో గురువారం ఇంటర్మీడియట్ పరీక్ష పేపర్ల వాల్యుయేషన్ క్యాంపు ముగిసింది. ఈ సందర్భంగా ఇంటర్మీడియట్ బోర్డు ఆధ్వర్యంలో 28 సబ్జెక్టులకు సంబంధించిన లక్షా యాభై నాలుగు వేల పేపర్లను వాల్యుయేషన్ పూర్తి చేశారు. వ్యాల్యూషన్ కార్యక్రమంలో అన్ని సబ్జెక్టులకు సంబంధించి 314 మంది ఎగ్జామినర్స్, 90 మంది చీఫ్ ఎగ్జామినర్స్, 90 మంది స్క్రూటినీలతో పాటు 10 మంది క్యాంప్ ఆఫీసర్లు కలిసి ఎటువంటి సమస్యలు లేకుండా వాల్యుయేషన్ కార్యక్రమాన్ని పూర్తి చేసినట్లు ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి కృష్ణయ్య తెలిపారు.

మేము పాలకులం కాదు.. సేవకులం

- రాజంపేట సర్వతోముఖాభివృద్ధికి పాటుపడతా
- అన్నమయ్య ప్రాజెక్టును నిర్మిస్తా
- మెడికల్ కళాశాలను తెప్పిస్తా
- రాజంపేటకు రింగ్‌రోడ్డు వేయిస్తా
- జిల్లా కేంద్రం కోసం పాటుపడతా
- పార్టీ కోసం కష్టపడిన వారికి సముచిత స్థానం కల్పిస్తా
- రాజంపేట టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యం



రాజంపేట టీడీపీ కార్యాలయ ప్రారంభోత్సవ సభలో అందరికీ నమస్కరిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యం



ప్రసంగిస్తున్న టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సుగవాసి ప్రసాద్ బాబు



హాజరైన తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు

రాజంపేట, ఏప్రిల్ 4: తాము పాలకులం కాదు సేవకులమని.. తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే రాజంపేట సర్వతోముఖాభివృద్ధికి కృషి చేస్తానని సుగవాసి బాలసుబ్రమణ్యం తెలిపారు. రాజంపేటలోని ఎల్ఐసీ ఆఫీసు పక్కన ఉన్న ఏబీ చంద్రారెడ్డి కల్యాణమండపంలో టీడీపీ కార్యాలయాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్యకర్తలను ఉద్దేశించి సుగవాసి బాలసుబ్రమణ్యం మాట్లాడుతూ... తమ తండ్రి సుగవాసి పాలకొండ్రాయుడు టీడీపీ ఆవిర్భావం నుంచి పార్టీలోనే ఉంటూ నాలుగుసార్లు ఎమ్మెల్యేగా, ఒకసారి ఎంపీగా గెలిచారన్నారు. తాను రైల్వేకోడూరులో పుట్టానని, రాజంపేటలో పెరిగానని, రాయచోటిలో ఉంటున్నానన్నారు. రాజంపేటలోని సుండుపల్లి, వీరబల్లి మండలాల ప్రజలకు తమ కుటుంబం ఎంతో సేవ చేసిందన్నారు. రాజంపేట, నందలూరు, సుండుపల్లి, వీరబల్లి, ఒంటిమిట్ట, సిద్దవటం మండలాలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానన్నారు. తాము పాలకులము కాదని, సేవకులమని అన్నారు. టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడును ముఖ్యమంత్రిని చేసుకోవడమే మనందరి ధ్యేయమన్నారు. పార్టీ గెలుపుకోసం కృషి చేసే కార్యకర్తలకు, నాయకులకు సముచిత స్థానం రావడానికి అన్ని విధాలా పాటుపడతామన్నారు. తాను రాజంపేటలోనే ఉంటానని, ఇక్కడ నిజాయితీ కలిగిన టీడీపీ కార్యకర్తలు ఉండటం తన అదృష్టమన్నారు. తాము రాజంపేట ఎమ్మెల్యే టికెట్టు ఆశించలేదని, పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు ఇక్కడ పోటీ చేస్తున్నాను తప్ప ఎవ్వరినీ ఇబ్బంది పెట్టాలన్న ఉద్దేశ్యం లేదన్నారు. తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే.. అన్నమయ్య డ్యాంను నిర్మిస్తామని, మెడికల్ కళాశాలను తెప్పిస్తానని, రాజంపేట అభివృద్ధితో పాటు రింగ్‌రోడ్డును వేయిస్తానని అన్నారు. మీ అందరి ఆకాంక్ష మేరకు రాజంపేటను జిల్లా కేంద్రం చేసేందుకు పాటుపడతానన్నారు.

మాది మాటతప్పని..
మడమ తిప్పని కుటుంబం : ప్రసాద్‌బాబు

టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సుగవాసి ప్రసాద్ బాబు మాట్లాడుతూ తమ తండ్రి పాలకొండ్రాయుడు అడుగు జాడల్లో తన సోదరుడు, ఎమ్మెల్యే అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యం ఎంతో నిజాయితీ పరుడని, సేవా తత్పరుడని అన్నారు. ఆయనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే రాజంపేట నియోజకవర్గ అభివృద్ధికి, కార్యకర్తల అభ్యున్నతికి అహర్నిశలు పాటుపడతామన్నారు. తమది మాటతప్పని మడమ తిప్పని కుటుంబమన్నారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శులు బాలిశెట్టి హరిప్రసాద్, చెన్నూరు సుధాకర్, జిల్లా లీగల్‌సెల్ అధ్యక్షుడు తరిగోపుల లక్ష్మీనారాయణ, టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు గన్నె సుబ్బనరసయ్యనాయుడు, జిల్లా కాకతీయ సేవా సమితి అధ్యక్షుడు శివన్నారాయణ చౌదరి, జనసేన పార్టీ రాష్ట్ర మహిళా నేత రెడ్డిరాణి, మాజీ మార్కెట్‌యార్డ్ చైర్మన్ ఎద్దల విజయసాగర్, గీతాంజలి విద్యాసంస్థల అధినేత ఎస్వీ రమణ, మాజీ మండల పార్టీ అధ్యక్షుడు సంజీవరావు, రాష్ట్ర కల్లుగీత కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ కొమరా వెంకటనరసయ్య, ఒంటిమిట్ట మండల పార్టీ ప్రధానకార్యదర్శి బొబ్బిలి రాయుడు, మాజీ కౌన్సిలర్ గుగ్గిళ్ల చంద్రమౌళి, రాజంపేట అసెంబ్లీ టీడీపీ ప్రధాన కార్యదర్శి సుబ్రమణ్యంనాయుడు, బీసీ నాయకులు రాము యాదవ్, దొంతం శివ, మహిళానేత సుజాత, జిల్లా టీడీపీ కార్యదర్శి నాగమునిరెడ్డి, రాజంపేట పార్లమెంటు ఉపాధ్యక్షురాలు వాణి తదితరులు పాల్గొన్నారు.

రైలును ఢీకొని యువకుడి ఆత్మహత్య


మృతి చెందిన రాజేశ్

జమ్మలమడుగు, ఏప్రిల్ 4: డెమో రైలును ఢీకొని ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల మేరకు జమ్మలమడుగు మండలం కొత్త గుంటపల్లికి చెందిన బత్తల రాజేశ్ (30) గురువారం ఉదయం మోపెడ్‌లో జమ్మలమడుగు రైల్వేస్టేషన్ వద్దకు వచ్చి వాహనాన్ని పార్కింగ్ చేసి స్టేషన్‌లోకి వెళ్లాడు. నంద్యాల-కడప డెమో రైలు రాగానే ఎదురుగా వెళ్లి రైలును ఢీకొన్నాడు. దీంతో అక్కడికక్కడే మృతి చెందాడు. అతడికి వివాహం కాలేదు.

కుటుంబ కలహాలతో వివాహిత బలవన్మరణం


సునీత మృతదేహం

కాశినాయన ఏప్రిల్ 4: మండలంలోని కొండ్రాజుపల్లెలో జాజం సునీత (25) అనే వివాహిత గురువారం ఉరి వేసుకొని చనిపోయినట్లు నర్సాపురం ఏఎస్ఐ కాశయ్య తెలిపారు. పోలీసుల వివరాల మేరకు.. రెండేళ్ల క్రితం కుమారి చిన్నసిద్దయ్య రెండవ కూతురు సునీతను హైదరాబాద్‌లో పోలీస్ ఉద్యోగం చేస్తున్న జాజం సిద్దులుకు ఇచ్చి వివాహం చేశారు. పెండ్లి అయిన ఏడాదిలోపే భార్యాభర్తల మధ్య విభేదాలు తలెత్తాయి. పలుమార్లు పెద్దమనుషులు పంచాయతీలు చేశారు. విష యం కోర్టు వరకు వెళ్లింది. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌లో అక్క వద్ద ఉంటున్న సునీత గురువారం ఉదయం కొండ్రాజుపల్లెలోని పుట్టింటికి వచ్చింది. ఒకవైపు భర్త వేధింపులు మరోవైపు ఒంటరితనం భరించలేక ఇంట్లో ఎవరూ లేనిసమయంలో ఉరి వేసుకుంది. మృతురాలి భర్త ప్రస్తుతం హైదరాబాద్‌లోని నార్సింగి పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్నట్లు సమాచారం. పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోరుమామిళ్లకు తరలించారు.

బంగారు ఆభరణాలు సీజ్

ప్రొద్దుటూరు క్రైం, ఏప్రిల్ 4 : తమ పరిధిలో సుమారు 830 గ్రాముల బంగారు ఆభరణాలు సీజ్ చేసినట్లు వన్‌టౌన్ సీఐ శ్రీకాంత్ తెలిపారు. గురువారం వాహనాల తనిఖీ చేస్తుండగా, నెలటూరు ఉబేదుల్లా అనే వ్యక్తి వద్ద 830 గ్రాముల బంగారు ఆభరణాలు (రూ.54లక్షలు) పట్టుబడ్డాయన్నారు. సమావేశంలో ఎస్ఐ మంజునాథ్, సిబ్బంది ఉన్నారు.

రూ.10 లక్షల నగదు పట్టివేత

రాయచోటిటౌన్, ఏప్రిల్ 4: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో గురువారం అర్బన్ సీఐ సుధాకర్‌రెడ్డి, ఎస్ఐ లోకేశ్‌ల ఆధ్వర్యంలో రాయచోటి పట్టణంలోని సుండుపల్లె రోడ్డులోని షిఫా హాస్పిటల్ సమీపంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా రూ.10 లక్షల నగదు పట్టుబడింది. పోలీసుల కథనం మేరకు వివరాల్లోకి వెళితే... పట్టణంలోని సుండుపల్లె రోడ్డులో గల షిఫా హాస్పిటల్ సమీపంలో పోలీసులు వాహనాలు తనిఖీ నిర్వహించారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో ఎస్ఐ ఎం.లోకేశ్ రాయచోటి పట్టణంలోని షిఫా హాస్పిటల్ వద్ద వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ తనిఖీల్లో సిద్దయ్య అను వ్యక్తి వద్ద నుంచి ఎలాంటి ఆధారాలు లేని రూ.10 లక్షలు నగదు స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన నగదు సీజ్ చేసి ట్రెజరీలో జమచేయనున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఈ తనిఖీల్లో పోలీసు సిబ్బంది రామచంద్ర, జగన్ తదితరులు పాల్గొన్నారు.

రాజంపేటలో రూ.70 వేలు...

రాజంపేటటౌన్, ఏప్రిల్ 4: రాజంపేట పట్టణంలోని ఈడిగపాలెం బైపాసు ప్రాంతంలో రాజంపేట పట్టణ సీఐ మద్దయ్య ఆచారి ఆధ్వర్యంలో నాకాబందీ కార్యక్రమం నిర్వహించారు. గురువారం ఎలక్షన్ కోడ్ అమలులో ఉన్నందున నూతన వ్యక్తులు సంచారం, అసాంఘిక కార్యక్రమాలపై ఉక్కుపాదం మోపేందుకు ఈ కార్యక్రమం నిర్వహించినట్లు ఆయన తెలిపారు. ఈడిగపాలెంలో పలు అనుమానిత వాహనాలను, ఇళ్లను తనిఖీ చేశామని, అందులో సరైన పత్రాలు లేని వాహనాలను గుర్తించి వాటిని స్వాధీనం చేసుకున్నామన్నారు. అలాగే బైపాసు ప్రాంతంలో వాహనాల తనిఖీ చేస్తుండగా రాజంపేట డీబీఎస్‌పల్లెకు చెందిన దివాకర్‌నాయుడు రూ.70 వేల నగదుతో వెళుతుండగా విచారించామని, నగదుకు సంబంధించిన సరైన రికార్డులు లేకపోవడంతో నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున రూ.50 వేల నగదు పైబడి ఎవరైనా తీసుకెళ్లడం నేరమని, నగదుకు సంబంధించి సరైన ధ్రువపత్రాలు లేనిపక్షంలో ఆ నగదును స్వాధీనం చేసుకుంటామని సీఐ తెలిపారు.

మోటారు బైకు అదుపు తప్పి ఒకరి మృతి

పోరుమామిళ్ల, ఏప్రిల్ 4 : మోటరు బైకు అదుపుతప్పి ఓ వ్యక్తి మృతి చెందాడు. మండలంలోని కవలకుంట్ల హరిజనవాడకు చెందిన వీరపోగు వెంకటయ్య (38) గురువారం పోరుమామిళ్ల నుంచి ముసల్‌రెడ్డిపల్లె మీదుగా కవలకుంట్లకు వెళుతుండగా చెరువు కట్ట మలుపులో బైకు అదుపు తప్పడంతో, తలకు బలమైన గాయం తగిలడంతో పోరుమామిళ్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు. పంచాయతీరాజ్ రూరల్ డెవలప్‌మెంటు సలహాదారుడు నాగార్జునరెడ్డి మృతుని కుటుంబాన్ని పరామర్శించారు. మృతునికి ఇద్దరు ఆడపిల్లలు, ఒక కుమారుడు సంతానమని తెలిసింది.

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

కడప (క్రైం), ఏప్రిల్ 4 : కడప నగరం వడ్డెరకాలనీకి చెందిన ఓ వ్యక్తి బుధవారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యానుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు రిమ్స్ పోలీసులు తెలిపారు. వారి వివరాల మేరకు... పొన్నరెడ్డి ప్రసాద్ (37) కడప వడ్డెరకాలనీలో నివాసం ఉంటున్నాడు. మూడునెలల క్రితం భార్య సుప్రజ జీవనోపాధి నిమిత్తం గల్ఫ్‌కు వెళ్లింది. రెండు సంవత్సరాల పాపను ఆమె పుట్టింట్లో వదిలేసి వెళ్లింది. ఒంటరిగా ఉంటున్న రెడ్డిప్రసాద్ కూడా కువైట్‌కు వెళ్లానుకుంటున్నట్లు తెలిపారు. భార్య దూరం కావడంతో మనస్థాపం చెంది ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. మృతుడి తల్లి బాలమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు తెలిపారు.

లోఓల్టేజీని అరికడదాం : ట్రాన్స్‌కో ఎస్ఈ

సంబేపల్లె, ఏప్రిల్ 4: విద్యుత్ సరఫరాలో లోఓల్టేజీ సమస్యపై అదనపు ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేద్దామని విద్యుత్‌శాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్ రమణ తెలిపారు. గురువారం మండలంలోని సంబేపల్లె, యర్రగుంట్ల, దేవపట్ల ప్రాంతాల్లోని ట్రాన్స్‌ఫార్మర్లను, లైన్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు, సలహాలు అందించారు. సంబేపల్లె విద్యుత్ సబ్‌స్టేషన్‌లో చిన్నమండెం, సంబేపల్లె మండలాల క్షేత్రస్థాయి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఈ మాట్లాడుతూ వేసవిలో విద్యుత్ వినియోగం ఎక్కువగా ఉంటుందని, లోఓల్టేజీ సమస్య అధిగమించేందుకు అవసరమైన కొత్త ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయాలన్నారు. నీటి పథకాల కొత్త పనుల మరమ్మతులను యుద్ధప్రాతిపాదికన పూర్తి చేయాలన్నారు. ఇందులో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. వాలిపోయిన స్తంభాలను, లూజు లైన్లను, తక్కువ ఎత్తులో ఉన్న లైన్లను గుర్తించి సెట్ చేయాలన్నారు. నిర్లక్ష్యంతోనే ప్రమాదాలు సంభవిస్తున్నాయని, పనులు చేసేటప్పుడు సిబ్బంది భద్రత నియమాలు తప్పక పాటించాలన్నారు. కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్‌లు మార్చడం, ఫీజులు వేయడం వంటి పనులపై వెంటనే స్పందించాలన్నారు. సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలని, నివాసం ఉండని ఉద్యోగులకు ఇంటి అద్దె ఆపివేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రాయచోటి ఈఈ చంద్రశేఖర్‌రెడ్డి, సంబేపల్లె అసిస్టెంట్ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ రాజేశ్, జేఈలు సిబ్బంది పాల్గొన్నారు.

నవోదయ ఫలితాల్లో విశ్వం విద్యార్థుల ప్రతిభ



నవోదయ ప్రవేశాలు సాధించిన విశ్వం విద్యార్థులు

తిరుపతి (విద్య), ఏప్రిల్ 4: నవోదయ విద్యాలయాల్లో ప్రవేశాలకు జాతీయ స్థాయిలో నిర్వహించిన పరీక్షలో తిరుపతి విశ్వం విద్యార్థులు ప్రతిభ కనబరిచారని ఆ విద్యాసంస్థల అధినేత విశ్వనాథరెడ్డి తెలిపారు. 39 మంది విద్యార్థులు అత్యుత్తమ మార్కులు సాధించి నవోదయ పాఠశాలల్లో ప్రవేశాలు సాధించారని వెల్లడించారు. లక్ష్మీశ్రీ, జ్యోత్స్న, ఉదయశ్రీ, లాస్య, గౌతంకుమార్, కేతన్ భాస్కర్, లిఖిత, గంగజయదీప్‌రెడ్డి తదితరులు ప్రవేశాలు పొందిన వారిలో ఉన్నారని చెప్పారు. అకడమిక డైరెక్టర్ ఎన్.విశ్వచందన్‌రెడ్డి, కరస్పాండెంట్ ఎన్.తులసీ విశ్వనాథ్ విద్యార్థులను అభినందించారు. వారు మాట్లాడుతూ 34 సంవత్సరాలుగా జాతీయ స్థాయిలో జరిగే సైనిక్, నవోదయ, మిలిటరీ పాఠశాల వంటి పోటీ పరీక్షలకు తమ సంస్థ అత్యుత్తమమైందిగా పేరుగాంచిందని చెప్పారు.

డ్వాక్రా మహిళలకు గాలం



- యానిమేటర్లను రంగంలోకి దింపిన వైసీపీ
- ఎస్ఎల్ఎఫ్ రుణాలను ఇంతవరకు ఇవ్వని వైనం
- ఎన్నికల తర్వాత ఎస్ఎల్ఎఫ్ రుణాలు ఇస్తాం అంటూ
- డ్వాక్రా మహిళల ఓట్ల కోసం కొత్తమార్గం

పులివెందుల రూరల్, ఏప్రిల్ 4: ఏ ఒక్క ఓటును పక్కకు వెళ్లనివ్వకుండా రోజుకొక కొత్తదారిని వెతు క్కుంటున్న వైసీపీ.. ఇప్పుడు మరో మార్గం వేసింది. కొందరికే పరిమితమైన 'రుణాలు అందరికీ చేరువ చేస్తాం మా వెంట నడవండి' అని కొత్త ప్రచారానికి తెరలేపారు. అయితే ఈ మార్గం కేవలం డ్వాక్రా మహిళలకు మాత్రమే అంటూ గాలం వేస్తున్నారు. ఈ అస్త్రాన్ని ప్రయోగిం చేందుకు యానిమేటర్లను రంగంలోకి దింపుతు న్నారు. వివరాల్లోకి వెళితే..

పులివెందుల మెప్మా కింద ఎస్‌హెచ్‌జీ (సెల్ఫ్ హెల్ప్ గ్రూప్) సభ్యులకు బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పిస్తారనేది అందరికీ తెలిసిన విషయమే. ఆ రుణాన్ని వడ్డీతో సహా కంతుల వారీగా చెల్లిస్తుంటారు. ఈ చెల్లింపుతో పాటు సాధారణ పొదుపు చెల్లిస్తుంటారు. ఆయా గ్రూపుల ఆర్థిక స్థోమతను బట్టి రూ.100 నుంచి చెల్లిస్తుంటారు. ఈ సాధారణ పొదుపు చెల్లిస్తే గ్రూపులోని సభ్యులకు అత్యవసర పరిస్థితుల్లో ఇందులో నుంచి ఇది వరకు చెల్లించిన దానికంటే ఐదారురెట్ల రుణం ఇస్తారు. అత్యవసర పరిస్థితుల్లో ఈ పొదుపు నుంచి రుణం పొంది తమ అవసరాలను తీర్చుకుంటుంటారు. ఈ సాధారణ పొదుపు సభ్యులందరికీ తెలిసేలా ఉంటుంది. సాధారణ పొదుపుతో పాటు మరో పొదుపు కూడా చెల్లిస్తుంటారు. అదే ఎస్ఎల్ఎఫ్ (స్లమ్ లెవెల్ ఫెడరేషన్) పొదుపు. ఈ పొదుపు కింద దాదాపు 25 గ్రూపులు ఉంటాయి. ఇందులో ప్రతినెల ఒక్కో సభ్యురాలు రూ.100 చెల్లించాల్సిందే. ఈ పొదుపు నకు సంబంధించి రసీదులు గాని, ఇంతవరకు ఖాతాలో ఎంత నిల్వ ఉన్నది సభ్యులకు తెలియదు. ఇదంతా ఆర్పీల చేతుల్లో ఉంటుంది. ఈ డబ్బు బ్యాంకు అకౌంట్‌లో ఎవరి పేరుమీద ఉంటుందనే విషయం కూడా సభ్యులకు పూర్తిగా బహిరంగ పర్చరు. గతంలో గ్రూప్ సభ్యుల అవసరాన్ని ఆసరాగా తీసుకుని కొందరు ఆర్పీలు ఎస్ఎల్ ఎఫ్‌లో పొదుపు నగదును డ్రా చేసి వారికే తిరిగి వడ్డీలకు ఇవ్వడం చేసేవారు. సంఘాలలో డబుల్ ఎంట్రీలు, అవసరం లేకున్నా సభ్యులను చేర్పి ఇష్టానుసారంగా ఆర్పీలు రుణాలు వాడుకునే వారనే ఆరోపణలు ఉన్నాయి. ఇది బహిరంగ రహస్యం.

ఆర్పీలను రంగంలోకి దింపిన వైసీపీ

ఎన్నికలలో ఈసారి వైసీపీ ఆర్పీలను రంగంలోకి దింపినట్లు సమాచారం. వీరి ద్వారా ఎస్ఎల్ఎఫ్ రుణాల పేరిట ఆశ చూపుతున్నట్లు తెలిసింది. ఎన్నికలు అయిపోయిన తర్వాత ఎస్ఎల్ఎఫ్ రుణాలు ఇప్పించి మరింత సహకారం అందిస్తా మని మహిళలను మభ్యపెడుతున్నట్లు తెలిసింది. అయితే డ్వాక్రా సంఘంలోని పది మందిలో ఒకరికే రుణం పొందే అవకాశం ఉంటుంది. గత రెండు మూడేళ్లుగా ఎస్ఎల్ఎఫ్ రుణాలు ఇవ్వకపోవ డంతో నిల్వలు భారీగా ఉన్నట్లు తెలిసింది. ఆ నగదును ఎన్నికల అనంతరం అందరికీ సమానంగా పంచేం దుకు అన్ని ఏర్పాట్లు చేసుకున్నట్లు సమాచారం. డ్వాక్రా మహిళల ఓట్ల కోసం సరికొత్త మార్గాన్ని కనిపెట్టిందనడంలో ఎలాంటి సందేహం లేదు.

పులివెందుల మెప్మాలో..

పులివెందుల పట్టణ పరిధిలో 1330 ఎస్‌హెచ్‌జీ గ్రూపులు ఉండగా వీటికి 44 మంది ఆర్పీలు ఉన్నారు. ఈ గ్రూపులకు సంబంధించిన సమా చారం, విధివిధానాలు అన్నీ ఆర్పీల చేతుల్లోనే ఉంటాయి. ఈ 44 మంది ఆర్పీల పరిధిలో దాదాపు 13,300 మంది సభ్యులు ఉన్నారు. ఈ సభ్యులంతా వారు పొందిన రుణ కంతులు, సాధారణ పొదుపు రూ.100 చెల్లిస్తుంటారు. అయితే ఈ చెల్లింపుతో పాటు ఎస్ఎల్ఎఫ్ పొదుపు నెలనెలా రూ.100 చెల్లిస్తుంటారు. ఎస్ఎల్ఎఫ్ ఖాతాకు సంబంధించి అంతా ఆర్పీనే రాజు, మంత్రిగా వ్యవహరిస్తుంటారు. సభ్యులు చెల్లించిన ఎస్ఎల్ఎఫ్ పొదుపు నుంచి టీఎల్ఎఫ్ (టౌన్ లెవెల్ ఫెడరేషన్)కు ప్రతినెల ఆర్పీలు రూ.1,000 చెల్లిస్తుంటారని చెబుతున్నారు. టీఎల్ఎఫ్ విషయాన్ని పక్కనపెడితే ఎస్ఎల్ఎఫ్ పొదుపులో ఆర్పీలు తమ మాయ జాలాన్ని ప్రదర్శిస్తుంటారనే ఆరోపణలు ఉన్నాయి.

పూర్తి వివరాలు తెలియదు

ఎస్ఎల్ఎఫ్ పొదుపు ఖాతా గురించి తమకు పూర్తిగా తెలియదని పలు సంఘాల సభ్యులు అంటున్నారు. బ్యాంకు రుణ కంతులు, సాధారణ పొదుపునకు సంబంధించిన ఖాతా వివరాలు మాత్రమే తెలుసని అంటున్నారు. అత్యవసర సమయంలో రుణం అడిగితే ఇస్తున్నారు, అయితే అది సాధారణ పొదుపు నుంచా లేక ఎస్ఎల్ఎఫ్ పొదుపు నుంచా అనే వివరాలు ఏవీ తమకు తెలియదని అంటున్నారు. కాగా బ్యాంకు నుంచి తీసుకున్న రుణం పొందినపుడు రూ.1000 నుంచి రూ.3000 దాకా ఆర్పీలు డిమాండ్ చేస్తుంటారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై రాతపూర్వకంగా పై అధికారులకు ఇచ్చే ధైర్యం చేయలేకున్నామని చెబుతున్నారు. ఎందుకంటే మధ్యతరగతి కుటుంబాలకు ఎంతోకొంత కుటుంబ అవసరాలు తీర్చుకోవడం లేదా స్వయం ఉపాధిని మరింత విస్తరించుకునేందుకు డ్వాక్రా రుణాలు సహాయ పడుతున్నాయని చెబుతున్నారు.

ఫిర్యాదులు అందితే చర్యలు తీసుకుంటాం

- రాజేశ్వరి, సీఎంఎం, మెప్మా పులివెందుల

ఎస్ఎల్ఎఫ్ పొదుపు రుణాల గురించి మాకు ఇంతవరకు ఫిర్యాదు రాలేదు. ఏ గ్రూప్‌లో అయితే అవకతవకలు జరుగుతున్నాయో వారు ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం.

రాజంపేటలో సుగవాసి సోదరుల సుడిగాలి పర్యటన


ఆర్టీసీ మాజీ చైర్మన్ ఎద్దల సుబ్బరాయుడుతో రాజంపేట ఎమ్మెల్యే అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యం


మున్సిపల్ మాజీ చైర్మన్ మల్లెల శ్రీవాణి కుటుంబసభ్యులతో భేటీ అయిన సుగవాసి ప్రసాద్‌బాబు

రాజంపేటటౌన్, ఏప్రిల్ 4: రాజంపేట టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యం, ఆయన సోదరుడు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సుగవాసి ప్రసాద్‌బాబు సుడిగాలి పర్యటన చేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం మొదటిసారిగా రాజంపేటకు వచ్చిన వారిరువురు పలువురితో భేటీ అయ్యారు.

రాజంపేట మాజీ మండల టీడీపీ పార్టీ అధ్యక్షుడు కొండయ్యానాయుడు, రాజంపేట మున్సిపల్ మాజీ చైర్మన్ మల్లెల శ్రీవాణి, మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ మల్లెల సుబ్బరాయుడు, యువ నాయకులు మల్లెల సురేంద్ర కుటుంబీకులతో మాట్లాడారు. అలాగే నందలూరులో ఆర్టీసీ మాజీ చైర్మన్ ఎద్దల సుబ్బరాయుడు, నందలూరు మాజీ ఎంపీపీ పల్లె సుబ్రమణ్యం, ఆర్యవైశ్య సంఘ నాయకులు పాల ప్రకాష్, రాజంపేట మున్సిపల్ ఫ్లోర్ లీడర్ తుపాకుల అశోక్, రాజంపేట మండల సీనియర్ నాయకులు, కూచివారిపల్లెకు చెందిన వెంకటయ్యానాయుడు, మాజీ మండల ఉపాధ్యక్షులు రామనరసింహులు, టెక్స్‌మో మల్లి, హత్యరాల దేవస్థాన మాజీ చైర్మన్ బండారు బాలయ్య, మన్నూరు నాయకులు మురళీకృష్ణ, టీడీపీ మహిళానేత మిరియాల జ్యోతి, కౌన్సిలర్ చెంగమ్మ, తదితరులతో వారిరువురు భేటీ అయ్యారు.

శవ రాజకీయాలకు బ్రాండ్ అంబాసిడర్ జగన్

- *నాడు బాబాయి హత్య.. నేడు అవ్వాతాతలను చంపి రాజకీయం*
- *టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి మాధవీరెడ్డి*

కడప (ఎర్రముక్కపల్లె), ఏప్రిల్ 4: శవ రాజకీయాలకు బ్రాండ్ అంబాసిడర్‌గా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉన్నారని టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, కడప ఎమ్మెల్యే అభ్యర్థి మాధవీరెడ్డిలు సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. నాడు బాబాయి వైఎస్ వివేకా హత్య, నేడు అవ్వతాతల్ని చంపి రాజకీయం చేస్తున్నారని ఆరోపించారు. శవం ఎక్కడ ఎప్పుడు దొరుకుతుందా, రాజకీయం చేద్దాం అనేలా జగన్‌రెడ్డి తయారయ్యారన్నారు. జోగి రమేశ్ చేత చనిపోయిన వృద్ధురాలితో రాజకీయం చేయాలని ప్రయత్నించాడని బాధిత కుటుంబం ఛీవాట్లుపెట్టి తరిమికొట్టిందన్నారు. బాధల్లో ఉన్న వారిని ఓదార్చడం మాని వారితో కూడా శవ రాజకీయాలకు పాల్పడుతున్నారని అన్నారు. ఖజానాలో నిధులు లేకనే పింఛన్లు పంపిణీ చేయలేదని తెలిపారు. ఇంటి వద్దనే పింఛన్ల పంపిణీకి కలెక్టర్లు సరేనన్నా దానిని వ్యతిరేకిస్తున్న సెర్ప్ సీఈవో మురళీధర్‌రెడ్డిని వెంటనే ఆ బాధ్యతల నుంచి ఎన్నికల కమిషన్ తప్పించాలన్నారు. పింఛను సొమ్ముతో పాటు ప్రభుత్వ నిధులు 13 వేల కోట్లు మార్చి 16 నుంచి 30 మధ్య పదిహేను రోజుల్లోనే ఎన్నికల కోడ్‌కు వ్యతిరేకంగా సొంత కాంట్రాక్టర్లకు జగన్‌రెడ్డి దోచి పెట్టారన్నారు. సచివాలయ సిబ్బంది గ్రామకార్యదర్శులతో ఇంటి వద్దనే పింఛను పంపిణీ చేయకపోవడానికి నిధులు కొరతనే కారణం కానీ ఎన్నికల కమిషన్, తెలుగుదేశం కాదన్నారు. నిత్యావసర వస్తువుల ధరలు భారీగా పెంచి పన్నులు మోది, ధరల వాత పెట్టి ఐదేళ్లలో పెంచింది వెయ్యి మాత్రమేన్నారు. టీడీపీ ప్రభుత్వం పింఛనుదారులకు నెలకు రూ.4వేల చొప్పున ఇంటి వద్దకే పంపిణీ చేస్తుందని చంద్రబాబు హామీ ఇచ్చారన్నారు.

శ్రీనివాసులు హత్య దోషులను శిక్షించే వరకు పోరాటం


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

కడప (మారుతీనగర్), ఏప్రిల్ 4: మండలంలోని యాదవాపురం గ్రామానికి చెందిన ఆదిమూలం శ్రీనివాసులు యాదవ్‌ను హత్య చేసిన వారిని, హత్యకు కారకులైన దోషులందరినీ శిక్షించేవరకు పోరు ఆపే ప్రసక్తే లేదని పలువురు నాయకులు తేల్చిచెప్పారు. గురువారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర, బీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి త్రివిక్రమ్, అఖిల భారత యాదవ మహా సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గంగాదేవి గంగయ్య యాదవ్, మృతుడి తల్లిదండ్రులు, బంధువులతో కలిసి మాట్లాడారు. పెండ్లిమర్రి మండలం దాసరిపల్లె పొలంలో 2003 సంవత్సరంలో కొత్తపల్లెకు చెందిన జి.సుబ్బారెడ్డి, జి.రామసుబ్బారెడ్డి వద్ద నుంచి 5 ఎకరాల 10 సెంట్ల భూమిని మృతుడి తండ్రి ఆదిమూలం చిన్న సుబ్బరాయుడు కొనుగోలు చేశారన్నారు. ఆ భూమి తాలూకు అన్ని డాక్యుమెంట్లు ఉన్నప్పటికీ ఆ భూమిలో మాకు కూడా 70 సెంట్ల భూమి ఉందని కొత్తపల్లెకు చెందిన జి.పుల్లారెడ్డి, అతడి అనుచరులు నిత్యం చిన్న సుబ్బరాయుడు కుటుంబంతో గొడవ పడుతుండేవారన్నారు. ఆ భూవివాదాన్ని పరిష్కరించాలని పలుమార్లు సంబంధిత తహశీల్దార్, కలెక్టర్‌కు చిన్నసుబ్బరాయుడు విన్నవించుకున్నప్పటికీ స్పందన లేదన్నారు.

ఇదిలా వుండగా పెద్దలతో పెట్టుకోవద్దని, వాళ్లు కమలాపురం ఎమ్మెల్యే అనుచరులు, అధికార పార్టీ నాయకులని సర్దుకుపోవాలని అప్పటి తహశీల్దార్ పదే పదే చిన్నసుబ్బరాయుడు కుటుంబానికి చెప్పినట్లు వెల్లడించారు. కాగా ఆ భూమిని సర్వే చేయించాలని, సర్వేలో ఎవరికి వస్తే వారే తీసుకోవచ్చని చిన్న సుబ్బరాయుడు చెప్పి డబ్బులు కూడా చెల్లించినప్పటికీ సర్వే చేయడానికి వచ్చే ప్రతి సందర్భంలో పుల్లారెడ్డి అడ్డుపడుతూ ప్రస్తుతం డాక్యుమెంట్లు మా వద్ద లేవని కాలయాపన చేశారని ఆరోపించారు. ఒకానొక సందర్భంలో పుల్లారెడ్డి అనుచరులు మారణాయుధాలతో చిన్నసుబ్బరాయుడు కుటుంబంపై దాడికి ప్రయత్నించా రన్నారు. దీనిపై పెండ్లిమర్రి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు వెళ్లగా అక్కడి ఎస్ఐ సునీల్‌కుమార్‌రెడ్డి కూడా స్పందించక పోగా వాళ్లు అధికార పార్టీ నాయకులు, ఎమ్మెల్యే అనుచరులంటూ బాధితులనే భయభ్రాంతులకు గురిచేయడం దారుణమన్నారు. ఇటు జిల్లా ఉన్నతాధికారులు, అటు పెండ్లిమర్రి అప్పటి తహశీల్దారు ఉదయభాస్కర్‌రాజు, ఎస్ఐ సునీల్ కుమార్‌రెడ్డి స్పందించి ఉంటే శ్రీనివాసులు హత్యకు గురయ్యేవాడు కాదన్నారు. హత్యకు పరోక్షంగా కారకులైన తహశీల్దార్, ఎస్ఐని నిందితులుగా చేర్చి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు గంగా సురేష్, యాదవ సంఘం నాయకులు రెడ్డయ్య యాదవ్, మల్లికార్జునయాదవ్, విజయ్‌కుమార్, పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

నాణ్యమైన ఉత్పత్తుల కోసం 'వేగ'

- ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి


వేగ రైతు ఉత్పత్తిదారుల కంపెనీని ప్రారంభిస్తున్న ఎంపీ అవినాష్‌రెడ్డి

వేంపల్లె, ఏప్రిల్ 4 : నాణ్యమైన ఉత్పత్తుల కోసం వేగ రైతు ప్రొడ్యూసర్ సంస్థ పనిచేస్తుందని కడప పార్లమెంట్ సభ్యుడు వైఎస్ అవినాష్‌రెడ్డి తెలిపారు. స్థానిక రిజిస్ట్రార్ కార్యాలయం సమీపంలో ఏర్పాటు చేసిన వేగ రైతు ఉత్పత్తిదారుల కంపెనీని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, కమలాపురం ఎమ్మెల్యే రవీంద్రనాథరెడ్డిలు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంపీ మాట్లాడుతూ వినూత్నమైన వ్యవసాయ పరిజ్ఞానం కోసం, నాణ్యమైన అధిక వ్యవసాయ ఉత్పతుల కోసం వేగ కంపెనీ పనిచేస్తుందని చెప్పారు. రైతుల చేత రైతుల కొరకు ఏర్పాటు చేస్తున్న అతి పెద్ద రైతు ఉత్పత్తిదారుల కంపెనీ వేగ కంపెనీ అన్నారు. త్వరలోనే యాభై ఎకరాల్లో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపీ స్పష్టం చేశారు. కొత్త ఆలోచనతో వేగ రైతు ప్రొడ్యూసర్ సంస్థను రాజశేఖర్‌రెడ్డి తీసుకుని రావడం జరిగిందని చెప్పారు. రైతులు సాగుచేసే పంటలకు విత్తనాలు, ఎరువులు ఇవ్వడంతో పాటు పంటలకు ఎంతశాతంలో నీరు కట్టాలి అనే వాటిపై కూడా అవగాహన కల్పిస్తారని తెలిపారు. దిగుబడి వచ్చిన తర్వాత పంటను వారే గిట్టుబాటు ధరలకు కొనుగోలు చేస్తారని చెప్పారు. వేంపల్లెలో వేగ రైతు ఉత్పత్తిదారుల కంపెనీని ఏర్పాటు చేయడం సంతోషకరమని చెప్పారు. వేంపల్లెలో విజయవంతం అయితే జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో అన్ని పంటలకు ఇలాంటి ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్‌లు ఏర్పాటు చేయడం జరుగుతుందని చెప్పారు. రైతులకు ప్రయోజనకరంగా ఉండే విధంగా వేగ కంపెనీ ముందుకు రావాలని కోరారు. అనంతరం వేగ కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ఉత్పత్తులను దేశీయ, అంతర్జాతీయ మార్కెట్లో సరైన ధరకు విక్రయించడానికి ధరలు పూర్తిగా పడిపోయినప్పుడు ఫుడ్ ప్రాసెసింగ్ ద్వారా ఉత్పత్తులను తయారుచేసి గిట్టుబాటు ధర పొందడం కోసం వేగ కంపెనీలో సభ్యత్వం ఉండాలని కోరారు. కార్యక్రమంలో కమలాపురం ఎమ్మెల్యే రవీంద్రనాథరెడ్డి, శాసనమండలి మాజీ చైర్మన్ సతీష్‌కుమార్‌రెడ్డి, జడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి, వైసీపీ మండల కన్వీనర్, చంద్రఓబుల్‌రెడ్డి, సర్పంచ్ రాచినేని శ్రీనివాసులు, రైతులు పాల్గొన్నారు.

వైభవంగా నడివీధి గంగమ్మ జాతర



గ్రామంలో ప్రతిష్ఠించిన నడివీధి గంగమ్మ

ఒంటిమిట్ట, ఏప్రిల్ 4: మండల కేంద్రంలో ఒంటిమిట్టలో గంగమ్మ జాతరను గురువారం వైభవంగా నిర్వహించారు. అమ్మవారిని వేకువజామున గ్రామ పొలిమేర నుంచి ప్రత్యేకంగా అలంకరించిన ఆసాది హరికథల నడుమ నడివీధి గంగమ్మ పురవీధుల గుండా గ్రామంలోకి ప్రవేశించారు. అమ్మవారికి దారిపొడవునా జంతు బలిదానాలు చేస్తూ మొక్కులు చెల్లించి నడివీధి వద్ద గంగమ్మ తల్లిని ప్రతిష్ఠించారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలను పెద్దఎత్తున నిర్వాహకులు ఏర్పాటు చేశారు. గ్రామం మొత్తం విద్యుత్ దీపాలంకరణ చేపట్టడంతో గ్రామంలో సందడి వాతావరణం నెలకొంది. సాయంత్రం అమ్మవారిని దర్శించుకునేందుకు పెద్దఎత్తున పిల్లలు, మహిళలు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించారు. రాత్రికి గ్రామ సంప్రదాయం మేరకు అమ్మవారిని ఊరి పొలిమేర వరకు సాగనంపనున్నారు.

బాలసుబ్రమణ్యంకు ఘన స్వాగతం





రాజంపేట పొలిమేర పాళ్యం వద్ద సుగవాసి బాలసుబ్రమణ్యంకు స్వాగతం పలుకుతున్న టీడీపీ నాయకులు, బాలసుబ్రమణ్యంను సన్మానిస్తున్న జనసేన నాయకుడు తుంగా రమణయ్య

- వందలాది వాహనాల కాన్వాయ్‌తో రాక
- టీడీపీ కార్యాలయం ప్రారంభం

రాజంపేటటౌన్, ఏప్రిల్ 4: రాజంపేట టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యంకు గురువారం రాజంపేటలో ఘన స్వాగతం లభించింది. రాజంపేట నియోజకవర్గంలోని సుండుపల్లి, రాజంపేట ప్రాంతాల నుంచి వందలాది వాహనాలతో కాన్వాయిగా రాజంపేటకు విచ్చేశారు. ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటించిన తరువాత తొలిసారి రాజంపేటకు వస్తున్న సందర్భంగా టీడీపీ నాయకులు పెద్దఎత్తున స్వాగత ఏర్పాట్లు చేశారు. భారీ గజమాలలు, శాలువాలు వేస్తూ స్వాగతం పలికారు. ముందుగా పాళ్యం వద్ద ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాజంపేట పొలిమేర పాళ్యం చేరుకోగానే పెద్దఎత్తున స్వాగతం పలికారు. తదనంతరం రాజంపేటకు చేరుకున్న వారు నూతన టీడీపీ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాజంపేట మండల టీడీపీ అధ్యక్షుడు గన్నె సుబ్బనరసయ్యనాయుడు, దొంతం శివ, గీతాంజలి విద్యాసంస్థల అధినేత ఎస్.వి.రమణ, మన్నూరు టీడీపీ నాయకుడు, హత్యరాల దేవస్థాన మాజీ చైర్మన్ బండారు బాలయ్య, కాకతీయ సేవా సమితి జిల్లా అధ్యక్షుడు శివన్నారాయణ చౌదరి, సుండుపల్లె మండల అధ్యక్షుడు రెడ్డప్ప, మహేష్ నాయుడు పాల్గొన్నారు.

సుగవాసి సోదరులతో ముస్లింలు భేటీ

సుగవాసి బాలసుబ్రమణ్యం, ప్రసాద్‌బాబులను గురువారం ముస్లింలు రాజంపేటలో భేటీ అయ్యారు. ముస్లిం నాయకుడు అబుబకర్ తదితరుల ఆధ్వర్యంలో ఇరువురితో భేటీ అయ్యారు.



బాలసుబ్రమణ్యంకు కర్జూరాలు తినిపిస్తున్న ముస్లింలు

చలివేంద్రాల ఏర్పాటు అభినందనీయం

- జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

రాయచోటిటౌన్, ఏప్రిల్ 4: వేసవిని దృష్టిలో పెట్టుకొని రాయచోటి ఏరియా ఆసుపత్రిలో రోగుల సౌకర్యార్థం చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ అన్నారు. గురువారం రాయచోటి పట్టణంలోని ఏరియా ఆసుపత్రిలో దాత పల్లా రఘుపతి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శ్రీచౌడేశ్వరి ప్యూరిఫైడ్ డ్రింకింగ్ వాటర్ చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వేసవిలో పట్టణానికి వచ్చే ప్రయాణికులతో పాటు ఏరియా ఆసుపత్రికి వచ్చే రోగుల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. రోగులకు, ప్రజలకు చల్లని మజ్జిగ, తాగునీరు అందించడం పుణ్య కార్యక్రమమన్నారు. అనంతరం తహసీల్దార్ జయన్న మాట్లాడుతూ వేసవి దృష్టిలో ఉంచుకొని పట్టణ ప్రజల, ప్రయాణికుల సౌకర్యార్థం రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో చలివేంద్రాలు ఏర్పాటు చేసి జిల్లా కలెక్టర్ ఆదేశాలను అమలు చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ డేవిడ్ సుకుమార్, డాక్టర్ బయ్యారెడ్డి, డాక్టర్ జేబీ వెంకటేశ్వర్‌రెడ్డి, దాత పల్లా రఘుపతి, చౌడేశ్వరిదేవి ఆలయ ధర్మకర్త వెంకటేశ్వర్లు, డాక్టర్ మహేశ్వర్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో నిర్భయంగా ఓటేయండి

- రాయచోటిలో కేంద్ర బలగాల కవాతు



కేంద్ర బలగాల కవాతులో పాల్గొన్న సీఐ, ఎస్ఐ

రాయచోటిటౌన్, ఏప్రిల్ 4: రాబోయే ఎన్నికల్లో ప్రతి ఒక్క ఓటరు నిర్భయంగా ఓటేయాలని అర్బన్ సీఐ సుధాకర్‌రెడ్డి సూచించారు. ఎస్పీ కృష్ణారావు ఆదేశాల మేరకు గురువారం ఆయన ఎస్ఐ భక్తవత్సలంతో కలిసి రాయచోటి పట్టణంలో కేంద్ర బలగాలతో కవాతు నిర్వహించారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పటిష్ట బందోబస్తు కార్యక్రమంలో భాగంగా ప్రజలను చైతన్యవంతం చేసేందుకు కేంద్ర, రాష్ట్ర బలగాలతో పలు వీధుల్లో కవాతు నిర్వహించి ఓటర్లలో ఉన్న భయాన్ని పోగొట్టారు. ఎన్నికల సందర్భంగా శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా కట్టుదిట్టమైన భద్రత ఉంటుందన్నారు. ప్రతి ఒక్క ఓటరు నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. మీ భద్రతే మా బాధ్యత అంటూ ప్రజలకు భరోసా కల్పించారు. ఓటు వేయాల్సిన బాధ్యత మీదని, సమస్యాత్మక ప్రాంతాలైన నిఘా ఉంచామన్నారు. స్థానికంగా ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని పట్టణ ప్రజలకు సూచించారు.

రూపానందరెడ్డికి కాపు నాయకుల సన్మానం



రూపానందరెడ్డిని సన్మానిస్తున్న కాపు నాయకులు

రైల్వేకోడూరు, ఏప్రిల్ 4: టీడీపీ ఇన్‌ఛార్జ్ ముక్కా రూపానందరెడ్డిని గురువారం కాపు నాయకులు కల్లా చలపతి, అనుముల గుండం చంద్రమోహన్, గునిపాటి రాయుడు, గునిపాటి కిరణ్‌లు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కాపు నాయకులు మాట్లాడుతూ కాపు ఓట్లు రైల్వేకోడూరు నియోజకవర్గంలో ఎక్కువగా ఉన్నాయని తెలిపారు. ఒక్క కాపు ఓటు కూడా పక్కకు పోకుండా చూస్తామని, అరవ శ్రీధర్ గెలుపునకు ముమ్మరంగా కృషి చేస్తామన్నారు. ఐదు మండలాల్లో ప్రచారం చేసి మంచి మెజార్టీ తీసుకుని వచ్చేందుకు కృషి చేస్తామన్నారు. రైల్వేకోడూరు నియోజకవర్గంలో వైసీపీకి గడ్డురోజులు దగ్గర పడ్డాయని, బలిజలు అంతా కూటమి వైపు ఉన్నారని తెలిపారు.

అందర్నీ పిలిచి.. అవస్థలకు గురిచేసి..

- పింఛన్‌దారుల పడిగాపులు

సంబేపల్లె, ఏప్రిల్ 4: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పింఛన్ల పంపిణీని సచివాలయాల వద్ద ఏర్పాటు చేశారు. కానీ సచివాలయ సిబ్బంది గ్రామంలో అందరినీ పిలిచి సమస్యలకు గురిచేసినట్లు పింఛన్‌దారులు వాపోయారు. గ్రామాల్లో వలంటీర్లు పింఛన్‌దారులను రెచ్చగొడుతూ రాజకీయ డ్రామాతో ఒకసారిగా అందరినీ సచివాలయాలకు పొమ్మనడంతో శెట్టిపల్లె గ్రామంలో మూడు గ్రామ పంచాయతీలకు సంబంధించి లబ్ధిదారులు గుంపులుగా వచ్చేశారు. నడవలేని వారికి ఇళ్ల వద్దకు వెళ్లి పంపిణీ చేయాల్సిన సచివాలయ సిబ్బంది వెళ్లకపోవడంతో సచివాలయానికి రావాల్సి వచ్చింది. సుమారు 1500 పింఛన్లు ఉన్న ఈ గ్రామంలో ఇద్దరు మాత్రమే పింఛన్లు పంపిణీ చేయడంతో లబ్ధిదారులు క్యూలో నిల్చోవాల్సి వచ్చింది. కేవలం కుటిల ఆలోచనలతోనే టీడీపీపై నెపం వేస్తూ పింఛన్‌దారులను ఇబ్బందులకు గురిచేస్తున్నట్లు లబ్ధిదారులు తెలిపారు.



శెట్టిపల్లెలో పింఛన్ల కోసం సచివాలయానికి తండోపతండాలుగా తరలివచ్చిన లబ్ధిదారులు

లిబరేషన్ కాంగ్రెస్ పార్టీతోనే పేదల ప్రభుత్వం

రాయచోటిటౌన్, ఏప్రిల్ 4: పేదల కోసం సుస్థిరమైన ప్రభుత్వం ఏర్పాటు ఒక్క లిబరేషన్ కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని ఆ పార్టీ రాయచోటి నియోజకవర్గ అభ్యర్థి అనంతపురం హరికృష్ణ అన్నారు. జిల్లా కేంద్రమైన రాయచోటి నియోజకవర్గం లక్కిరెడ్డిపల్లె మండలం చౌటపల్లి గ్రామ పంచాయతీకి చెందిన హరికృష్ణను లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు విజయ్‌కుమార్ నియోజకవర్గ అభ్యర్థిగా ప్రకటించిన నేపథ్యంలో పట్టణంలోని ఎన్జీవో హోంలో గురువారం మీడియాతో మాట్లాడారు. పేదల కోసం సుస్థిరమైన ప్రభుత్వం ఏర్పాటు చేయడమే లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు సురేంద్ర, రెడ్డెయ్య, నవీన్‌కుమార్, రాజేశ్, ఖలీల్‌బాషా, మహేశ్, వెంకట్రమణ, రామకృష్ణ, రామాంజులు, బాలాజీ, నాగేంద్ర పాల్గొన్నారు.

వనరులు సక్రమంగా వినియోగించుకోవాలి

చిన్నమండెం, ఏప్రిల్ 4: శక్తివనరులను సక్రమంగా వినియోగించుకోవాలని మల్లూరు జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రెడ్డెన్న అన్నారు. గురువారం స్థానిక పాఠశాలలో సేవ్ ఎర్త్ సేవ్ ఎనర్జీ కార్యక్రమాన్ని విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో ఏర్పాటు చేసి వీలైనంత ఎక్కువ చెట్లను పెంచాలని, విద్యుత్ వినియోగంలో ఆదా పద్ధతులను పాటించాలన్నారు. భవిష్యత్తులో విద్యుత్, నీటి ప్రాముఖ్యత గురించి వివరించారు. సేవ్ ఎనర్జీ కార్యక్రమంపై పిల్లలకు వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులతో పాటు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వైసీపీ అరాచక పాలనను అంతం చేద్దాం

గాలివీడు, ఏప్రిల్ 4: గత నాలుగేళ్లుగా రాష్ట్రంలో వైసీపీ అరాచక పాలన సాగించిందని, ఇటువంటి ప్రభుత్వాన్ని అంతం చేయాలని నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి రాంప్రసాద్‌రెడ్డి కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఆయన గురువారం మండలంలోని చీమలచెరువుపల్లి పంచాయతీలో కమలామ్రిలో పర్యటించారు. అనంతరం రెడ్డెప్పరెడ్డి, దివాకర్‌రెడ్డిలు ఇచ్చిన విందు కార్యక్రమంలో పాల్గొని, అనంతరం ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతరం మండలంలోని చీమలచెరువుపల్లె పంచాయతీలోని కడపవాండ్లపల్లి, ఎర్రదొడ్డిపల్లి, కొప్పులవాండ్లపల్లె, రెడ్డివారిపల్లె, కమలామ్రి నుంచి రెడ్డెప్పరెడ్డి, దివాకర్‌రెడ్డి, చిరసాని రెడ్డెప్పరెడ్డి కుటుంబాలతో పాటు 50 కుటుంబాలు వైసీపీ నుంచి టీడీపీలోకి వచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు పొట్లి జగన్నాధరెడ్డి, మహమ్మద్‌రియాజ్, మాజీ ఎంపీటీసీలు శేషారెడ్డి, మాజీ వక్ఫ్ బోర్డు మెంబర్ లక్ష్మయ్య, టీడీపీ నాయకులు సూరి, కుమార్‌రెడ్డి, రమణారెడ్డి పాల్గొన్నారు.

మండలాన్ని అభివృద్ధి చేస్తా

రామాపురం: రాబోవు ఎన్నికల్లో రాయచోటి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రజలు తమను గెలిపిస్తే మండలాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తానని రాయచోటి ఎమ్మెల్యే అభ్యర్థి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. మండలంలోని రాచపల్లి పంచాయతీలో నాయునివారిపల్లె, కొలిమివాండ్లపల్లె, రాళ్లపల్లి, గొల్లపల్లి, హరిజనవాడ, గంగనేరు క్వాటర్స్ వడ్డెపల్లి, రాచపల్లె, సిర్రావాండ్లపల్లె గ్రామాల్లో గురువారం ఆయన టీడీపీ నాయకులు, కార్యకర్తలతో ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

అంతేకాకుండా మండలంలో రాచపల్లి పంచాయతీ గంగనేరు క్వాటర్స్‌లో గురువారం ఏర్పాటు చేసిన జయహో బీసీ సభకు ముఖ్య అతిథిగా రాయచోటి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి రాంప్రసాద్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల వారికి కూడా అవకాశాలు కల్పిస్తూ టీడీపీ ముందుకు నడిపిస్తోందన్నారు.

వలంటీర్ వ్యవస్థకు వ్యతిరేకం కాదు

వలంటీర్ వ్యవస్థకు టీడీపీ వ్యతిరేకం కాదని టీడీపీ రాయచోటి ఎమ్మెల్యే అభ్యర్థి రాంప్రసాద్‌రెడ్డి గురువారం అన్నారు. రామాపురంలో



గాలివీడులో మాట్లాడుతున్న రాంప్రసాద్‌రెడ్డి

ఆయన విలేకరులతో మాట్లాడుతూ వలంటీర్లను రెచ్చగొట్టడం ద్వారా వైసీపీ రాజకీయంగా లబ్ధి పొందాలని చూస్తోందన్నారు. పింఛన్ల పంపిణీ విషయంలో జగన్ ప్రభుత్వం నీచ రాజకీయాలు చేస్తోందని విమర్శించారు.

చిన్నమండెంలో ఇఫ్తార్ విందు

మండల కేంద్రంలోని అయాన్ జ్యువెలర్స్ యజమాని రహంతుల్లాఖాన్ కుమారులు సజ్జాద్‌ఖాన్ బ్రదర్స్ ఇచ్చిన ఇఫ్తార్‌విందులో బుధవారం రాత్రి టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ప్రసాద్‌బాబు, టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి రాంప్రసాద్‌రెడ్డిలు పాల్గొన్నారు. అనంతరం అక్కడ ముస్లిం మైనార్టీ పెద్దలు, టీడీపీ నాయకులతో సమావేశమయ్యారు.

ముగిసిన సీజీఆర్ ట్యాలెంట్ మీట్ ప్రోగ్రాం

రాజంపేటటౌన్, ఏప్రిల్ 4: రాజంపేట మండల పరిధిలోని బోయనపల్లె అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాలలో గత రెండు రోజులుగా జరుగుతున్న సీజీఆర్ ట్యాలెంట్ మీట్-2024 గురువారం ముగిసింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆర్అండ్‌డీ జేఎన్‌టీయూ అనంతపురానికి చెందిన ప్రొఫెసర్ బి.ఈశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం పోటీ ప్రపంచంలో కంప్యూటర్, మొబైల్ ఫోన్ లేనిదే ఏ పనీ జరగడం లేదని, ప్రస్తుతం ఏఐ, డేటా స్ట్రక్చర్స్ డేటా మైనింగ్, క్లౌడ్ కంప్యూటింగ్ అనే అంశాలపై విద్యార్థులు మంచి అవగాహన పెంపొందించుకోవాలని ఆయన తెలిపారు. కళాశాల వైస్ చైర్మన్ చొప్పా యల్లారెడ్డి మాట్లాడుతూ కళాశాల ప్రారంభం నుంచి విద్యార్థుల కోసం అనేక ట్యాలెంట్ మీట్ ప్రోగ్రాంలు నిర్వహించినట్లు ఆయన పేర్కొన్నారు. అనంతరం ప్రొఫెసర్ బి.ఈశ్వర్‌రెడ్డిని కళాశాల యాజమాన్యం శాలువా, పూలమాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్ఎంవీ నారాయణ, కళాశాల డీన్ డాక్టర్ ఎం.సుబ్బారావు, డాక్టర్ పి.ఫణీంద్ర కుమార్‌రెడ్డి, డాక్టర్ టి.హరికృష్ణ, డాక్టర్ సి.మధుమోహన్‌రెడ్డి, డాక్టర్ సుబ్రమణ్యం, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘర్షణలో ఇరువర్గాలపై కేసు నమోదు

రాయచోటిటౌన్, ఏప్రిల్ 4: రాయచోటి పట్టణంలోని గున్నికుంట్ల రోడ్డులో సర్వే నెంబర్ 374/4ఏలోని 20 సెంట్ల స్థల విషయంపై బుధవారం సాయంత్రం జరిగిన ఘర్షణలో ఇరువర్గాలపై కేసు నమోదు చేసినట్లు అర్బన్ సీఐ సుధాకర్‌రెడ్డి తెలియజేశారు. రాయచోటి పట్టణంలోని గున్నికుంట్ల రహదారిలో గల ఎస్పీ బంగ్లాకు సమీపంలోని స్థలం విషయంపై బుధవారం సయ్యద్‌బాషా, ఆయన కుమారుడు సయ్యద్ జాఫర్‌లతో పాటు పల్లపు రమేశ్, ఆయన సోదరుడు పల్లపు రామాంజనేయులు మధ్య ఘర్షణ జరిగింది. ఈ ఘర్షణలో ఒక వర్గానికి చెందిన సయ్యద్ బాషా, అతని కుమారుడు సయ్యద్ జాఫర్ మరో వ్యక్తితో పాటు.. మరో వర్గానికి చెందిన పల్లపు రమేశ్, అతని సోదరుడు పల్లపు రామాంజనేయులు మరో వ్యక్తిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలియజేశారు.

దాడి చేసిన వారిని శిక్షించాలంటూ ఎస్పీకి వినతిపత్రం

తనపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని పట్టణంలోని 11వ వార్డులో నివాసం ఉంటున్న సయ్యద్ బాషా రెండవ కుమారుడు సయ్యద్ జాఫర్ ఎస్పీ క్రిష్ణారావుకు గురువారం ఫిర్యాదు చేశారు. తాను గున్నికుంట్ల రోడ్డులో తెలిసిన వారితో మాట్లాడుతుండగా కారులో వచ్చిన పల్లపు రమేశ్, అతని అనుచరుడు రామాంజనేయులు, మాజీ ఎంపీపీ పోలు సుబ్బారెడ్డి, అతని అనుచరులు ఇడగొట్టు భాస్కర్, సాయి, మహేశ్వర్‌రెడ్డిలతో పాటు మరో 10 మందిపై కేసు నమోదు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు చెన్నూరు అన్వర్‌బాషా, జాఫర్ వలి, అతావుల్లా, మాజీ ఎంపీపీ ఖాదర్‌బాషా తదితరులతో కలిసి ఎస్పీకి వినతిపత్రం ఇచ్చారు.

ఘనంగా సీతారామ ప్రాణప్రతిష్ఠ

- భక్తిశ్రద్ధలతో కల్యాణం

సుండుపల్లె, ఏప్రిల్ 4: మండల పరిధిలోని రాయవరం పంచాయతీ ఎగువ జంగంపల్లిలో నూతనంగా నిర్మించిన రామాలయంలో సీతారామ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో భాగంగా గురువారం సీతారామస్వామి కల్యాణోత్సవం గ్రామస్థులు ఘనంగా నిర్వహించారు. గ్రామంలో నూతనంగా ఆలయం నిర్మించి సీతారామ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం గురువారం ఉదయం వైభవంగా నిర్వహించారు. అనంతరం ప్రాణప్రతిష్ఠ కార్యక్రమం, 10 గంటలకు సీతారామ కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా వేద పండితులతో నిర్వహించారు. కల్యాణం అనంతరం అన్నదాన వితరణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాలు ఆలయ ధర్మకర్త నాగతులసయ్య కుటుంబ సభ్యులతో పాటు ఎగువ జంగంపల్లి గ్రామస్థుల సహకారంతో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కల్యాణాన్ని తిలకించేందుకు చుట్టుపక్కల నుంచి గ్రామస్థులు పెద్ద ఎత్తున పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

సుగవాసి బాలసుబ్రమణ్యంపై కేసు నమోదు

రాజంపేటటౌన్, ఏప్రిల్ 4: రాజంపేట టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యంపై రాజంపేట పట్టణ పోలీసులు కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ మద్దయ్య ఆచారి పేర్కొన్నారు. ఎలక్షన్ కోడ్ అమలులో ఉన్న తరుణంలో గురువారం సుగవాసి బాలసుబ్రమణ్యం ఎలాంటి అనుమతులు లేకుండా పట్టణంలో పెద్దఎత్తున ర్యాలీ నిర్వహించి కోడ్‌ను ఉల్లంగించిన కారణంగా కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. మున్సిపల్ కమిషనర్ రాంబాబు ఫిర్యాదు మేరకు బాలసుబ్రమణ్యంపై కేసు నమోదు చేయడం జరిగిందన్నారు. కోడ్ నిబంధనలకు విరుద్ధంగా ఎవ్వరూ ఎలాంటి కార్యక్రమాలు నిర్వహించకూడదని, అలా చేసిన ఎంతటి వారిపైనైనా సరే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పట్టణ సీఐ మద్దయ్య ఆచారి పేర్కొన్నారు.


వైభవంగా రంగనాయకుల స్వామి గ్రామోత్సవం



సాంస్కృతిక కార్యక్రమాలకు పెద్దఎత్తున హాజరైన భక్తులు

చిట్వేలి, ఏప్రిల్ 4: మండలంలోని రంగనాయకుల స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా 8వ రోజు స్వామివారికి ప్రత్యేక పూజల అనంతరం వైభవంగా గ్రామోత్సవం నిర్వహించారు. ఈ మేరకు గురువారం మల్లెంపల్లె గ్రామస్థులచే పౌరాణిక నాటక ప్రదర్శన, మధ్యాహ్నం కంసాలపల్లి వాస్తవ్యులు చిన్నపోలు శివరాంరెడ్డి కుటుంబ సభ్యులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. రాత్రి మల్లెంపల్లి వాస్తవ్యులు కస్తూరి రామాంజనేయుడు కుటుంబ సభ్యులు అన్నదానం నిర్వహించారు. దేవుని ఊరేగింపును జట్టివారిపల్లె అరుంధతివాడ గ్రామస్థులు వెంకటయ్య కుటుంబ సభ్యులు నిర్వహించారు. రాత్రి పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు, చుట్టుపక్కల గ్రామపెద్దలు ఉత్సవాలను పర్యవేక్షించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

కాకర్లవారిపల్లెలో పోలీసుల ఓవరాక్షన్



ఎస్ఐతో మాట్లాడుతున్న గ్రామస్థులు

పెనగలూరు, ఏప్రిల్ 4: మండల పరిధిలోని కాకర్లవారిపల్లెలో గురువారం సాయంత్రం ఎస్ఐ సుభాస్ చంద్రబోస్ ఆధ్వర్యంలో స్థానిక పోలీసులతో పాటు స్పెషల్ పార్టీ పోలీసులు ఓవరాక్షన్ చేసినట్లు గ్రామ ప్రజలు పేర్కొన్నారు. వివరాలిలా.. పోలీసు 30 యాక్టు అమలులో భాగంగా తనిఖీల పేరుతో గ్రామంలోని 120 ఇళ్లలో పోలీసులు బూటు కాళ్లతో పూజ గదుల్లోకి వెళ్లడమే కాకుండా, బెడ్‌రూముల్లో పరుపులు, కప్‌బోర్డుల్లో ఉన్న దుస్తులను కిందపడేసినట్లు ఆరోపించారు. అంతేకాకుండా వంటగదులు, బాత్‌రూముల్లో పరిశీలించి, వంట సామాన్లు చెల్లాచెదురుగా పడేసి గందరగోళం సృష్టించినట్లు పేర్కొన్నారు. ఈ మేరకు సుమారు 50 మంది ప్రజలు రాత్రి 10 గంటల సమయంలో స్టేషన్ వద్దకు వచ్చి పోలీసులతో వాగ్వివాదానికి దిగారు. అనంతరం ఎస్ఐ సుభాస్ చంద్రబోస్‌తో మాట్లాడారు. ఆయన స్పందిస్తూ మీ వద్ద ఏమైనా ఆధారాలుంటే తమకు అందజేస్తే చర్యలు చేపడతామని సూచించారు. అంతటితో గ్రామస్థులు ఈ విషయాన్ని శుక్రవారం కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని చెప్పినట్లు తెలిసింది.

ఓటు హక్కుపై అవగాహన ర్యాలీ

ఓబులవారిపల్లె, ఏప్రిల్ 4: మండలంలోని జడ్పీ హైస్కూల్ విద్యార్థుల ఆధ్వర్యంలో ఓబులవారిపల్లె టౌన్ పరిధిలోని వీధుల్లో ఓటు హక్కుపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో కలెక్టర్, ఎన్నికల కమిషనర్ ఆదేశాల మేరకు బ్యానర్లు కట్టి విద్యార్థులతో నినాదాలు చేస్తూ తిరిగారు. ఓటు హక్కు వజ్రాయుధం లాంటిదని, దాన్ని మంచి నాయకుడుని ఎన్నుకునేందుకు వినియోగించుకోవాలని తెలిపారు. ఎంఈఓ రెడ్డయ్య, హైస్కూలు ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో విద్యార్థులతో ఈ కార్యక్రమం నిర్వహించారు.

విద్యార్థుల్లో సామాజిక చైతన్యం ఉండాలి

- ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ నాగరాజనాయుడు

రైల్వేకోడూరు, ఏప్రిల్ 4: విద్యార్థుల్లో సామాజిక చైతన్యం ఉండాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వై.నాగరాజనాయుడు తెలిపారు. గురువారం రైల్వేకోడూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఘనంగా 41వ వార్షికోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ విద్యార్థిని, విద్యార్థులు ఎంతో కష్టపడి చదివి మంచి ఫలితాలను సాధిస్తున్నారని, మెరుగైన విద్యార్థులుగా తయారు చేయడంలో అధ్యాపకులు విశేషంగా కృషి చేశారన్నారు. రిటైర్డ్ ప్రిన్సిపాల్ డాక్టర్ సీఎస్ సుకుమార్‌రెడ్డి మాట్లాడుతూ విద్య ప్రాధాన్యత గురించి వివరించారు. అనంతరం విద్యార్థిని, విద్యార్థులు ఉల్లాసంగా, ఉత్సాహంగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అలాగే పలు క్రీడలు నిర్వహించి అందులో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు పంపిణీ చేశారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.రమేష్, ఐక్యు ఏసీ కో-ఆర్డినేటర్ జి.దయానందం, అధ్యాపకులు డాక్టర్ సుబ్రహ్మణ్యం రాజు, డాక్టర్ ఈ.ప్రేమలత, జి.శివయ్య, మోషే, విశ్వనాథ్, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ఆశాలకు వేతనాలు ఇవ్వాలి : యూనియన్

రైల్వేకోడూరు, ఏప్రిల్ 4: ఆశావర్కర్లకు వేతనాలు వెంటనే ఇవ్వాలని ఏపీ ఆశా వర్కర్ల యూనియన్ గౌరవాధ్యక్షుడు మాదరాజు గంగాధర్ తెలిపారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఉగాది, రంజాన్ పండుగలకు జీతాలు లేక ఆశాలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. జీతాలు చెల్లించకపోతే ఆందోళన చేపడతామని తెలిపారు.

ఎద్దల సుబ్బరాయుడుతో సుగవాసి భేటీ

నందలూరు, ఏప్రిల్ 4: రాజంపేట నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యం గురువారం మాజీ ఆర్టీసీ రీజనల్ చైర్మన్ ఎద్దల సుబ్బరాయుడుతో నందలూరులోని వారి ఇంటిలో భేటీ అయ్యారు. ఈ నేపథ్యంలో పలు రాజకీయ అంశాలపై చర్చించారు. అనంతరం మాజీ ఎంపీపీ పల్లె సుబ్రమణ్యం, విశ్రాంత ఉపాధ్యాయుడు రామసుబ్బన్నలను సుగవాసి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ అధ్యక్షుడు ఎద్దుల విజయసాగర్ తదితరులు పాల్గొన్నారు.

నవోదయ ఫలితాల్లో విశ్వం విద్యార్థుల ప్రతిభ



నవోదయ ప్రవేశాలు సాధించిన విశ్వం విద్యార్థులు

తిరుపతి (విద్య), ఏప్రిల్ 4: నవోదయ విద్యాలయాల్లో ప్రవేశాలకు జాతీయ స్థాయిలో నిర్వహించిన పరీక్షలో తిరుపతి విశ్వం విద్యార్థులు ప్రతిభ కనబరిచారని ఆ విద్యాసంస్థల అధినేత విశ్వనాథరెడ్డి తెలిపారు. 39 మంది విద్యార్థులు అత్యుత్తమ మార్కులు సాధించి నవోదయ పాఠశాలల్లో ప్రవేశాలు సాధించారని వెల్లడించారు. లక్ష్మీశ్రీ, జ్యోత్స్న, ఉదయశ్రీ, లాస్య, గౌతంకుమార్, కేతన్ భాస్కర్, లిఖిత, గంగజయదీప్‌రెడ్డి తదితరులు ప్రవేశాలు పొందిన వారిలో ఉన్నారని చెప్పారు. అకడమిక డైరెక్టర్ ఎస్. విశ్వచందన్‌రెడ్డి, కరస్పాండెంట్ ఎస్.తులసీ విశ్వనాథ్ విద్యార్థులను అభినందించారు. వారు మాట్లాడుతూ 34 సంవత్సరాలుగా జాతీయ స్థాయిలో జరిగే సైనిక్, నవోదయ, మిలిటరీ పాఠశాల వంటి పోటీ పరీక్షలకు తమ సంస్థ అత్యుత్తమమైందిగా పేరుగాంచిందని చెప్పారు.

ఉరేసుకుని విద్యార్థి ఆత్మహత్య

● అనుమానాస్పదస్థితిలో మృతిగా కేసు నమోదు



మృతి చెందిన సాయి రితీష్

చౌడేపల్లె, ఏప్రిల్ 4: ఇంట్లో ఉరేసుకుని తొమ్మిదో తరగతి విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తండ్రి ఫిర్యాదు మేరకు అనుమానాస్పద స్థితిలో మృతిగా పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ ప్రతాప్‌రెడ్డి తెలిపిన ప్రకారం.. చౌడేపల్లెలోని సచివాలయం-1లో వీహెచ్‌ఏగా పని చేస్తున్న హేమకల్యాణి.. ఆమెచిన్న కుమారుడు సాయి రితీష్(14) కలిసి బజారువీధిలోని అద్దె ఇంట్లో ఉంటున్నారు. ఆమె భర్త బెంగళూరులో హోటల్ నడుపుతున్నారు. 9వ తరగతి చదువుతున్న రితీష్ మధ్యాహ్నం ఇంటికి వచ్చాడు. కాగా, సచివాలయంలో విధులు ముగించుకుని మధ్యాహ్నం 2 గంటలకు హేమకల్యాణి ఇంటికి వచ్చారు. ఇంటి తలుపులు వేసి ఉండటం, కుమారుడిని పిలిచినా పలకలేదు. తలుపు గడిని బద్దలు కొట్టి ఇంట్లోకి వెళ్లి చూసే సరికి దూలానికి ఉరేసుకుని వేలాడుతున్న కుమారుడిని చూసి షాక్‌కు గురయ్యారు. కుటుంబీకులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి, పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని పుంగనూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడి తండ్రి సహదేవుడు ఫిర్యాదు మేరకు అనుమానాస్పద స్థితిలో మృతిగా కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు ఎస్‌ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో భర్త మృతి

● భార్యకు తీవ్ర గాయాలు



మృతి చెందిన నాగరాజ

సోమల, ఏప్రిల్ 4: సోమల- సదుం మార్గం దిడ్డివారిపల్లె సమీపంలో ద్విచక్ర వాహనం చెట్టును ఢీకొన్న ఘటనలో నాగరాజ మృతి చెందగా.. అతడి భార్య మునీశ్వరమ్మకు తీవ్రగాయాలయ్యాయి. అన్నమయ్య జిల్లా పీలేరు మండలం రేగళ్లకు చెందిన నాగరాజ దంపతులు పలమనేరులో జరిగిన ఓ వివాహానికి హాజరయ్యారు. అనంతరం పెద్దపంజాణి మండలం మాడీ గ్రామంలో ఉన్న వీరి కుమార్తె మాధవి ఇంటికి వెళ్లారు. అక్కడ్నుంచి గురువారం మధ్యాహ్నం 3గంటలకు మోపెడ్‌లో స్వగ్రామానికి బయలుదేరారు. సోమల సమీపం దిడ్డివారిపల్లె వద్ద వీరి ద్విచక్ర వాహనం అదుపుతప్పి చెట్టును ఢీకొంది. అక్కడికక్కడే నాగరాజ మృతిచెందారు. మునీశ్వరమ్మకు తీవ్రగాయాలయ్యాయి. ఈమార్గంలో ప్రయాణిస్తు తిమ్మానాయనపల్లె ఎంపీటీసీ వాసు వీరిని గుర్తించి.. క్షతగాత్రురాలిని పీలేరు ప్రభుత్వ వైద్యశాలకు 108 వాహనంలో తరలించారు. మృతుడి కుమారుడు నవీన్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదుచేసి నాగరాజ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పుంగనూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

ముగిసిన పుంగనూరు గంగజాతర

● నిమజ్జనంతో ప్యాలెస్‌కు చేరిన సుగుటూరు గంగమ్మ



నిమజ్జనానికి ఊరేగింపుగా వెళుతున్న సుగుటూరు గంగమ్మ, నడివీధి గంగమ్మ

పుంగనూరు, ఏప్రిల్ 4: పుంగనూరు సుగుటూరు గంగమ్మ జాతర గురువారం ఉదయం నిమజ్జనంతో ముగిసింది. మంగళవారం జమిందారుల తొలిపూజతో ప్రారంభమైన జాతర రాత్రి ఊరేగింపు అనంతరం బుధవారం ప్యాలెస్ ఆవరణలోని ఆలయంలో అమ్మవారిని ప్రతిష్ఠించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. గురువారం ఉదయం 5గంటలకు సుగుటూరు గంగమ్మను ప్యాలెస్‌లోని ఆలయం నుంచి వెలుపలకు తెచ్చి ఊరేగింపుగా నిమజ్జనానికి తీసుకెళుతుండగా మధ్యలో బజారువీధిలోని నడివీధి గంగమ్మ, మల్లారమ్మ కలిశారు. గంగమ్మలు సుబేదార్‌వీధి, తేరువీధి మీదుగా తూర్పుమొగసాలలోని చౌడేశ్వరిదేవి ఆలయం వరకు అట్టహాసంగా ఊరేగింపు సాగింది. చాముండేశ్వరిదేవి ఆలయానికి మల్లారమ్మ వెళ్లి సుగుటూరు గంగమ్మను పలకరించి వెనుతిరిగారు. అమ్మవారికి ఎనుపోతును బలిఇచ్చి తోటి కులస్తులు ఎనుపోతు తలను చాటలో పెట్టుకుని తీసుకెళ్లారు. గంగమ్మలకు చాముండేశ్వరి గుడి వద్ద భక్తి శ్రద్ధలతో నిమజ్జన కార్యక్రమాన్ని గూడూరుపల్లె పూజారులు నిర్వహించారు. నిమజ్జన కార్యక్రమం ముగియగానే సుగుటూరు గంగమ్మ విగ్రహాన్ని ఎవరికీ కనిపించకుండా వస్త్రాలతో చుట్టి ప్యాలెస్‌కు తీసుకొచ్చి భద్రపరిచారు. ప్యాలెస్‌లో పూజారులు అమ్మవారికి అలంకరించిన అభరణాలను జమీందార్లుకు అప్పగించిన అనంతరం జమీందార్ల మలి పూజతో సుగుటూరుగంగమ్మ ప్యాలెస్ గృహనిర్బంధంలోకి వెళ్లడంతో జాతర ముగిసింది. సుగుటూరు గంగమ్మ సేవాసంఘసభ్యులు, మున్సిపాలిటీ, వైద్యసిబ్బంది జాతరలో సహాయక కార్యక్రమాలు నిర్వహించారు. పోలీసులు గంగమ్మ దర్శనంలో కొందరిపై దురుసుగా ప్రవర్తించడం, వారికి కావాల్సిన వారు, అధికారపార్టీ నాయకులకు ప్రత్యేక దర్శనం కల్పించి భక్తులు, జాతరలో పనిచేసే సభ్యుల పట్ల ఇష్టం వచ్చినట్లు వ్యవహరించి విమర్శలపాలయ్యారు.



ఊరేగింపుగా వస్తున్న సుగుటూరు గంగమ్మ

'కూటమి' అభ్యర్థుల గెలుపే లక్ష్యం

● అట్టహాసంగా చిత్తూరు పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడిగా సీఆర్ రాజన్ ప్రమాణం



సంఘీభావం తెలుపుతున్న టీడీపీ నేతలు

చిత్తూరు సిటీ, ఏప్రిల్ 4: జిల్లాలోని టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించడమే లక్ష్యమని చిత్తూరు పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు సీఆర్ రాజన్ చెప్పారు. గురువారం పార్టీ అధ్యక్షుడిగా ఆయన ప్రమాణ స్వీకారం చేశారు. ఉదయం దొడ్డిపల్లెలోని కన్నికలమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అక్కడి నుంచి ర్యాలీగా కట్టమంచి, ప్రకాశం హైరోడ్డు, పీసీఆర్ సర్కిల్, కొత్త బస్టాండు, మీదుగా జిల్లా పార్టీ కార్యాలయానికి చేరుకున్నారు.. పీసీఆర్ సర్కిల్ వద్ద పార్టీ అభిమానులు క్రేన్ ద్వారా సీఆర్ రాజన్‌కు గజమాల వేశారు. అనంతరం జిల్లా పార్టీ కార్యాలయంలో ఆయన ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా సీఆర్ రాజన్ మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో చిత్తూరు పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడిగా నియమించినందుకు పార్టీ అధినేత చంద్రబాబు, ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్, రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు అచ్చెన్నాయుడుకు ధన్యవాదాలు తెలుపుతున్నానని చెప్పారు. ఇందుకు సహకరించిన పార్టీ నేతలు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలుపుతున్నానని అన్నారు. రాబోయే ఎన్నికల్లో జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు, ఒక ఎంపీ స్థానాన్ని భారీ మెజారిటీతో గెలిపించుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. పార్టీ నేతలు, కార్యకర్తలు సహకరించి, కలసికట్టుగా పనిచేయాలని కోరారు. వచ్చే ఎన్నికల్లో ఉమ్మడి టీడీపీ అభ్యర్థులను గెలిపించుకుని చంద్రబాబు నాయుడును ముఖ్యమంత్రిని చేయడమే లక్ష్యంగా పనిచేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, పార్టీ రాష్ట్ర కార్యదర్శులు సురేంద్రకుమార్, గురజాల సందీప్, నేతలు వైవీ రాజేశ్వరి, సీఎం విజయ, కోదండయాదవ్, చంద్రప్రకాష్, కటారి హేమలత, కాజూరు బాలాజి, త్యాగరాజన్, సప్తగిరి ప్రసాద్, అశోక్ ఆనంద్ యాదవ్, కాజూరు రాజేష్, ఈశ్వర్, శ్రీధర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ స్పాట్‌లో సౌకర్యాల కల్పన: డీఈవో

చిత్తూరు (సెంట్రల్), ఏప్రిల్ 4: టెన్త్ స్పాట్ కేంద్రంలో టీచర్లకు అవసరమైన ఏర్పాట్లు కల్పించినట్లు డీఈవో దేవరాజు గురువారం తెలిపారు. 1646 మంది ఉపాధ్యాయులకు అవసరమైన 450 టేబుళ్లు, 960 కుర్చీలు, 60 పెడస్ట్రియల్ ఫ్యాన్లు, 60 సీలింగ్ ఫ్యాన్లు, ఇద్దరు డాక్టర్లు, ఇద్దరు నర్సులతో మెడికల్ క్యాంపు, క్యాంటీన్, గదుల్లో వెలుతురు ఉండేలా సీట్లు ఏర్పాటు చేసినట్లు వివరించారు.

జేఈఈ మెయిన్స్ పరీక్షలు ప్రారంభం



అడ్మిట్, ఆధార్ కార్డు, ఇతర ధ్రువపత్రాలను పరిశీలిస్తున్న సిబ్బంది

చిత్తూరు (సెంట్రల్), ఏప్రిల్ 4: జిల్లాలో జేఈఈ మెయిన్స్ సెషన్ 2 పరీక్షలు గురువారం మొదలయ్యాయి. పూతలపట్టు మండలం పి.కొత్తకోట సమీపంలోని వేము ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కేంద్రంలో ఉదయం, మధ్యాహ్నం రెండు విడతల్లో పరీక్షలు జరిగాయని సిటీ కోఆర్డినేటర్ సుబ్రమణ్యం తెలిపారు. 172 మందికి గాను 157 మంది హాజరు కాగా, 15 మంది గైర్హాజరైనట్లు పేర్కొన్నారు. అభ్యర్థులను క్షుణ్ణంగా పరిశీలించి, బయోమెట్రిక్ అనంతరం పరీక్షా కేంద్రంలోకి అనుమతించామన్నారు.

88 శాతం పింఛన్ల పంపిణీ

చిత్తూరు (సెంట్రల్), ఏప్రిల్ 4: జిల్లాలో బుధవారం మొదలైన సామాజిక పింఛన్ల పంపిణీ గురువారం కొనసాగించారు. సాయంత్రం 6.30 గంటల సమయానికి జిల్లాలో 88 శాతం పింఛన్లు పంపిణీ చేసినట్లు డీఆర్‌డీఏ అధికారులు తెలిపారు. ఇంకా 32,749 మందికి పింఛన్లు ఇవ్వాల్సి ఉందన్నారు.

వేంకటేశ్వరస్వామి ఆలయంలో చోరీ

రూ.10లక్షల విలువైన బంగారు, వెండి ఆభరణాల అపహరణ

పూతలపట్టు, ఏప్రిల్ 4: మండలంలోని వావిల్‌తోట పంచాయతీ లక్ష్మయ్యవూరు గ్రామంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో చోరీ జరిగిన సంఘటన వెలుగులోకి వచ్చింది. గ్రామం పక్కనే స్వామివారి ఆలయం ఉంది. బుధవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ఆలయంలోకి చొరబడి బంగారు, వెండి ఆభరణాలతో పాటు విలువైన వస్తువులను దొంగిలించి తీసుకెళ్లారు. వాటి విలువ సుమారు రూ.10 లక్షలు ఉంటుందని స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సీఐ సుదర్శన ప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వేడెక్కిన చిత్తూరు

● సాయంత్రం వరకు వడగాల్పులు

● సాధారణం కంటే అధిక ఉష్ణోగ్రతల నమోదు



చిత్తూరు కలెక్టరేట్, ఏప్రిల్ 4: చిత్తూరు నగరం గురువారం మండింది. మధ్యాహ్నం వరకు తీవ్రంగా ఎండ కొనసాగింది. ఆ తర్వాత వడగాడ్పులు మొదలయ్యాయి. ఈ గాడ్పుల ప్రభావం సాయంత్రం 6 గంటల దాకా కొనసాగింది. దీంతో రాత్రిపూట కూడా ఆరుబయట వేడి వాతావరణం నెలకొంది. ఈ ఏడాది వేసవిలో తొలిసారిగా వరుసగా ఆరు రోజుల పాటు సాధారణం కంటే అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయని వాతావరణ శాఖ పేర్కొంది. శుక్ర, శని, ఆదివారాల్లోనూ జిల్లాలో 41డిగ్రీలకు మించి గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతాయని, వడగాడ్పులు వీస్తాయని హెచ్చరించారు. అత్యధికంగా నింద్రలో 42.5, శ్రీరంగరాజపురంలో 42.4, తవణంపల్లెలో 42.4, బంగారుపాళ్యంలో 41.8, పులిచెర్లలో 41.7 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. నగరిలో 40.9, సోమలలో 40.2, పుంగనూరులో 40.1, సదుంలో 40.0, పాలసముద్రంలో 40.0, గుడిపాలలో 39.8, గుడుపల్లెలో 39.6, యాదమరిలో 39.5, చౌడేపల్లెలో 39.5, రొంపిచెర్లలో 39.5, పెద్దపంజాణిలో 39.5, కార్వేటినగరంలో 39.4, వెదురుకుప్పంలో 39.4, కుప్పంలో 38.9, చిత్తూరులో 38.6, పలమనేరులో 38.6, పెనుమూరులో 38.6, శాంతిపురంలో 38.6, గంగాధరనెల్లూరులో 38.5, గంగవరంలో 38.5, వి.కోటలో 38.5, పూతలపట్టులో 37.9, బైరెడ్డిపల్లెలో 37.8, ఐరాలలో 37.7, రామకుప్పంలో 37.1, విజయపురంలో 36.8 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

తిరుమలలో నేడు డయల్ యువర్ ఈవో

తిరుమల, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): డయల్ యువర్ టీటీడీ ఈవో కార్యక్రమం శుక్రవారం జరుగనుంది. తిరుపతిలోని టీటీడీ పరిపాలన భవనం మీటింగ్ హాల్‌లో ఉదయం 9 నుంచి 10 గంటల మధ్య ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. భక్తులు తమ సందేహాలు, సూచనలు, ఫిర్యాదులపై టీటీడీ ఈవో ధర్మారెడ్డితో నేరుగా మాట్లాడవచ్చు. ఇందుకోసం 0877 2263261ను సంప్రదించాల్సి ఉంటుంది.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.34 కోట్లు

తిరుమల, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.34 కోట్లు లభించింది. మంగళవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ బుధవారం లెక్కించి గురువారం ఉదయం ప్రకటించింది. ఇక, బుధవారం 61,087 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 22,530 మంది తలనీలాలు సమర్పించారు.

మేమంతా సిద్ధంగా లేం!

జగన్‌కి తేల్చిచెప్పిన జనం - వెలవెలబోయిన నాయుడుపేట బహిరంగసభ

ప్రచారసభల్లో పదేపదే మీరు సిద్ధమా..అంటూ జగన్ అడుగుతూ ఉంటారు. వెంటనే కెమెరాలు వేదికకు దగ్గరగా ఒకే ప్రాంతం వైపు మళ్లుతాయి.అక్కడ వ్యూహాత్మకంగా ముందే ఏర్పాటు చేసుకున్నవారు చేతులెత్తి అరుస్తారు. ఉమ్మడి జిల్లాలో మదనపల్లె, పూతలపట్టు సభల్లో ఈ డ్రామా పండినా.. తిరుపతి జిల్లా నాయుడుపేట సభలో మాత్రం అడ్డం తిరిగింది. జనం లేక సభ వెలవెలపోగా, వచ్చిన జనం కూడా జగన్ మైకు ముందుకు రాగానే జారుకోవడం మొదలుపెట్టారు. మిగిలిన ఆ కాస్తమందీ పేలవంగా స్పందించారు. ఒక రకంగా జగన్ వెంట నడవడానికి తామంతా సిద్ధంగా లేమని జనం ప్రకటించినట్లు అయ్యింది. - నాయుడుపేట/శ్రీకాళహస్తి



జగన్ మాట్లాడుతుండగానే వెళ్లిపోతున్న జనం

జనమేరి నాయకా?

నాయుడుపేట సభకు తిరుపతి జిల్లావ్యాప్తంగా భారీగా జనాన్ని సమీకరించాలని అధికార పార్టీ నేతలు చేసిన ప్రయత్నం విఫలమైంది. గత మంగళవారం నుంచే సిద్ధం సభల కోసం 250 ఆర్టీసీ బస్సులు కేటాయించారు. అవి మదనపల్లె, పూతలపట్టు సభలకు జనాన్ని తరలించే పనిలో బిజీగా నడిచాయి. గురువారం వాటిని నాయుడుపేట సభకు మళ్లించారు. అయితే ఆ బస్సులు సరిపోవని భావించి బుధవారం అర్ధరాత్రి అదనంగా మరో 150 బస్సులు కేటాయించారు. మొత్తం 400 బస్సులు కేటాయించినా సభకు జనం రాలేదు. సభ వేదికపైకి జగన్ చేరుకునే సమయానికి కేవలం ముందువైపు గ్యాలరీల్లో మాత్రమే కార్యకర్తలు వున్నారు. ముప్పావు వంతు గ్యాలరీలు ఖాళీగా కనిపించాయి. జగన్ వేదికపైకి రావడంతో సభ వెలుపల, రోడ్లపై వున్న కార్యకర్తలను, ప్రజలను లోనికి వెళ్లాలంటూ పోలీసులు బతిమాలారు.జగన్ మాట్లాడడం మొదలుపెట్టిన పది నిమిషాల నుంచే ముందు వరుస గ్యాలరీల్లో పలచగా వున్న జనం కూడా బయటకు జారుకోవడం మొదలుపెట్టారు. ఇప్పటి వరకూ జరిగిన జిల్లాస్థాయి మేమంతా సిద్ధం సభల్లో ఇంతగా ఫెయిలైన సభ మరోటి లేదని పార్టీ వర్గాల్లో చర్చ మొదలైంది. రేణిగుంట మండలం గురవరాజుపల్లి వద్ద జగన్ రాత్రి బస చేసిన చోటకు 500 మంది మహిళలను బస్సుల్లో ముందే రప్పించి, ఆయన్ను చూడడానికి నిరీక్షిస్తున్నట్లు బిల్డప్ ఇచ్చారు. గంటన్నరకు పైగా అక్కడే పడిగాపులు కాసిన మహిళలకు కనీసం నిలువ నీడ కూడా లేకపోయింది. ఏర్పేడు మండలంలో ఒకటి రెండు చోట్ల మహిళా రైతులు, పెన్షనర్లు అయిన వృద్ధులను కూడా స్థానిక వైసీపీ నేత ఏర్పాటు చేశారు. అక్కడ బస్సు ఆపించి సీఎం జగన్ కిందకు దిగి వారితో మాట్లాడేలా ముందస్తు ఏర్పాటు చేశారు. కాగా జిల్లాలో మొత్తం 1100 ఆర్టీసీ బస్సులుండగా వాటిలో 400 బస్సులు సిద్ధం సభకు కేటాయించారు. దీంతో ఆర్టీసీ బస్టాండ్లలో బస్సుల కొరత కొట్టొచ్చినట్టు కనిపించింది.

క్రేన్‌కి వేలాడినా..

ఏర్పేడులోనే ఓ కార్యకర్త క్రేన్ సాయంతో భారీ గజమాల వేసేందుకు ఏర్పాటు చేసుకున్నారు. జగన్ బస్సు సమీపించగానే క్రేన్ కొక్కీ వద్ద ఆ కార్యకర్త గాల్లో వేలాడుతూ మాల వేసేందుకు సంసిద్ధమయ్యాడు. అయితే బస్సు ఆపినా జగన్ మాత్రం కిందకు దిగలేదు. దీంతో క్రేన్ సాయంతో ఆ కార్యకర్త గజమాలను బస్సు పైభాగంలో తాకించి సంతృప్తి పడాల్సి వచ్చింది. ఇంత ప్రమాదకర ఫీట్ చేసిన ఆ కార్యకర్తను వైసీపీ నేతలు గానీ పోలీసులు గానే వారించకపోవడం విమర్శలకు దారి తీసింది. అలాగే, ముందే నిర్ణయించుకున్న చోట్ల తప్ప మరెక్కడా జగన్ బస్సు ఆగలేదు. కిందకు దిగలేదు. దీనిపై పార్టీ శ్రేణులు నిరుత్సాహానికి లోనయ్యారు.

81 కిలోమీటర్ల బస్సు యాత్రతో జనానికి నరకం

రేణిగుంట మండలం గురవరాజుపల్లి నుంచి జగన్ గురువారం ఉదయం 10 గంటలకు బయల్దేరి నాయుడుపేటకు సాయంత్రం 5 గంటలకు చేరుకున్నారు. ఈ దూరం 53 కిలోమీటర్లు. అక్కడ నుంచీ గూడూరు వద్ద జిల్లా సరిహద్దుల వరకూ 28 కిలోమీటర్లు. మొత్తం ఈ 81 కిలోమీటర్ల దూరం సాగిన బస్సు యాత్ర జిల్లావ్యాప్తంగా వేలాదిమందికి ప్రత్యక్ష నరకం చూపించింది. రేణిగుంటలో బస్సు యాత్ర ప్రారంభం కావడానికి రెండు గంటల ముందే ట్రాఫిక్ ఆపేశారు. చెన్నై, కడప, నెల్లూరు, తిరుపతి కీలక మార్గాల్లో రెండు గంటల పాటు ట్రాఫిక్ ఆపడంతో వేలాది వాహనాలు కిలోమీటర్లకొద్దీ ఆగిపోయాయి. బస్సుయాత్ర ప్రారంభమైన అరగంట తర్వాత రాకపోకలకు అనుమతించినప్పటికీ ట్రాఫిక్ జామ్ కావడంతో మరో రెండు గంటల పాటు తీవ్ర అవస్థ పడ్డారు. ఏర్పేడు, శ్రీకాళహస్తి, పెళ్ళకూరు మండలాల్లోనూ ఇదే పరిస్థితి. ఇక విజయవాడ-చెన్నై జాతీయ రహదారిపై వేల కొద్దీ వాహనాలు రెండు వైపులా నిలిచిపోయాయి. ఇలా కనీసం నాలుగైదు గంటల పాటు జాతీయ రహదారిపై వాహనాలు చిక్కుకుపోయాయి. రేణిగుంట మండలం రామకృష్ణాపురం కూడలి వద్ద రెండు అంబులెన్సులు ఇరుక్కుపోయాయి. ఓ వాహనం రోగిని తేవడానికి శ్రీకాళహస్తికి వెళుతుండగా మరోటి రోగిని తిరుపతికి తీసుకెళుతూ గంటల కొద్దీ చిక్కుకుపోయింది. వేసవిలో ఎండ ధాటికి తోడు ఉక్కపోతకు వాహనాల్లోని జనం నరకయాతన అనుభవించారు.



ట్రాఫిక్‌లో ఇరుక్కున్న అంబులెన్స్

డ్రైవర్లు తక్కువ...యజమానులే ఎక్కువ

తొట్టంబేడు మండలం పొయ్య గ్రామం వద్ద సీఎం జగన్ లారీ, ఆటో డ్రైవర్లతో ముఖాముఖీ సమావేశమయ్యారు. నిజానికి హాజరైన వారిలో లారీ, ఆటో డ్రైవర్లు చాలా తక్కువ. వాటి యజమానులే ఎక్కువగా కనిపించారు. సమావేశంలోకి జగన్ రాకముందే ఆంధ్రజ్యోతి, ఏబీఎన్ పాత్రికేయులను స్థానిక నేతల ద్వారా గుర్తించి బయటకు పంపించేశారు. సమావేశం పేరుకు ముఖాముఖీ అయినా వారితో ముఖాముఖీ మాట్లాడిందేమీ లేదు. వారి చేతికి మైక్ ఇవ్వడంతో ఎక్కువమంది జగన్‌ను పొగిడేందుకే సమయం వెచ్చించారు. ఒకరిద్దరు సమస్యలు ప్రస్తావించినా జగన్ వాటిని వినిపించుకోనట్టుగా మిన్నకుండిపోయారు. ఎవరైనా సలహాలు, సూచనలు చేయదలిస్తే స్లిప్పులో రాసి పెట్టెల్లో వేస్తే తాను తర్వాత పరిశీలిస్తానంటూ వెళ్లిపోయారు.

సీఎం చెక్కు చెల్లాలంటే 40 రోజులు ఆగాలట!

రేణిగుంట మండలం గురవరాజుపల్లి నుంచీ బస్సు యాత్ర ప్రారంభించిన సీఎం జగన్ కొంచెం దూరం వెళ్లగానే వెదుళ్ళ చెరువు వద్ద తండ్రీ కొడుకులు ఆపారు. తన 12 ఏళ్ళ కుమార్తె చైత్ర వినికిడి సమస్యతో బాధపడుతుంటే ఆపరేషన్ చేయించామని తండ్రి వివరించాడు. సీఎం సహాయ నిధి కోసం దరఖాస్తు చేయగా చెక్కు వచ్చిందని, కానీ చెల్లడం లేదని వాపోయాడు. అయితే సీఎం సహాయనిధి నుంచీ సాయం అందాలంటే 40 రోజులు ఆగాలి అని సమాధానం ఇచ్చి జగన్ ముందుకు సాగిపోవడంతో తండ్రీ తనయలు తెల్లబోయారు.

వైసీపీ పాలనలో అభివృద్ధి పాతికేళ్లు వెనక్కి..

● అడవిపల్లె ప్రాజెక్టు గురించి ఒక్కసారైన అసెంబ్లీలో మాట్లాడారా.. ● నియోజకవర్గంలో ఏమేం సమస్యలు ఉన్నాయో ఎంపీ, ఎమ్మెల్యేలకే తెలీదు ● పీలేరు నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి

"నవ్యాంధ్రకు పోలవరం ఎలాగో పీలేరు నియోజకవర్గానికి అడవిపల్లె ప్రాజెక్టు అలాంటిది. దాని ప్రాధాన్యత గుర్తించి నేను, మా అన్నయ్య పీలేరు నియోజకవర్గంలోని 75వేల ఎకరాలకు లబ్ధి జరిగేలా కాలువలు నిర్మించాం. ఆ ప్రాజెక్టు పూర్తయి ఉంటే నియోజకవర్గం లోని రైతులకు అంతు లేని మేలు జరిగేది. గడిచిన ఐదేళ్లలో ఎమ్మెల్యే ఒక్కసారి కూడా అసెంబ్లీలో మాట్లాడిన పాపాన పోలేదు. ఎంపీ అయితే దాని గురించి పట్టించుకున్న దాఖలాలు కూడా లేవు. పైపెచ్చు కమీషన్లకు కక్కుర్తి పడి ప్రతిపక్షంలో ఉన్నప్పుడు వ్యతిరేకించిన చిత్తూరు పట్టణానికి పైపులైను పనులు మాత్రం దర్జాగా చేసేసుకున్నారు. వీళ్లా అభివృద్ధి గురించి మాట్లాడేది. నియోజకవర్గంలో అభివృద్ధి కుంటుపడిపోయింది. పెండింగ్ పనులు జాబి తా చాంతాడంత ఉంది. అయినా ఎంపీ, ఎమ్మెల్యేలకు చీమ కుట్టినట్లు కూడా లేదు. పెండింగ్‌లో ఉన్న సమస్య లపై వారు ప్రజలకు సమాధానం చెప్పి ఈ ఎన్నికల్లో ఓట్లు అడగాలి" అంటూ టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిశోర్ కుమార్‌రెడ్డి అధికార పార్టీ నేతలను నిలదీశారు. పీలేరు నియోజకవర్గంలోని పెండింగ్ సమస్యలపై ఆయన తన అంతరంగాన్ని ఆంధ్రజ్యోతి వద్ద ఆవిష్కరించారు.

- (కలికిరి/పీలేరు)

అసంపూర్తిగా హంద్రీ-నీవా పథకం

రాయలసీమకు హంద్రీ-నీవా పథకం సంజీవని లాంటిది. నిత్యం కరువు బారిన పడే రాయలసీమకు సాగు, తాగు నీరు అందించాలన్న లక్ష్యంతో నేను, మా అన్నయ్య ఆ పథకం ద్వారా పీలేరు నియోజకవర్గానికి మేలు చేయాలని ఎంతో అధ్యయనం చేసి నియోజకవర్గంలోని 75 వేల ఎకరాలకు లబ్ధి జరిగేలా కాలువలను డిజైన్ చేశాం. బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ మన నియోజకవర్గంలోనే ఉండేలా కేవీపల్లె మండలం అడవిపల్లె వద్ద నిర్మించేలా రూపొందించాం. దురదృష్టవశాత్తు అది పూర్తయ్యేలోపు 2014లో అధికారం కోల్పోయాం. ఆ ప్రాజెక్టు విలువ తెలిసిన నారా చంద్రబాబు నాయుడు 2014 తరువాత కూడా ఇబ్బుడిముబ్బుడిగా నిధులు కేటాయించి ప్రాజెక్టును పరుగులు తీయించారు. ఒక టీఎంసీ నీటి నిల్వ సామర్థ్యంలో నిర్మితమైన ఆ ప్రాజెక్టును సందర్శించేందుకు వచ్చిన చంద్రబాబు నాయుడు ఆ ప్రాజెక్టును చూసి ముచ్చటపడి, దాని సామర్థ్యం మరో టీఎంసీకి పెంచి ఆ నీటిని చిత్తూరు పట్టణ ప్రజల దాహార్తి తీర్చేందుకు అందివ్వాలని సంకల్పించారు. ఆ మేరకు చిత్తూరు మున్సిపాలిటీ ద్వారా పైపు లైను నిర్మాణం జరిగేలా ఆదేశాలు జారీ చేశారు. అప్పట్లో ప్రతిపక్షంలో ఉన్న వైసీపీ చిత్తూరు పైపులైను ప్రాజెక్టును తీవ్రంగా వ్యతిరేకించారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే అడవిపల్లె ప్రాజెక్టును యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి పీలేరు నియోజకవర్గాన్ని సస్యశ్యామలం చేస్తామన్నారు. చిత్తూరుకు నీళ్లే ఇవ్వమన్నారు. తీరా అధికారంలోకి వచ్చాక అడవిపల్లె ప్రాజెక్టు గురించి ఎంపీగానీ, ఎమ్మెల్యేగానీ పట్టించుకున్న పాపాన పోలేదు. కానీ చిత్తూరు పట్టణానికి పైపులైను మాత్రం పూర్తి చేసేశారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు తీవ్రంగా వ్యతిరేకించిన ఆ పనులను అధికారంలోకి వచ్చా క హుటాహుటిన పూర్తి చేసే శారు. గానీ ప్రాజెక్టుకు నీళ్ల తెచ్చే పని మాత్రం చేయలేదు. అసెంబ్లీలో తాను నిత్యం చర్చల్లో పాల్గొంటానని గొప్పలు చెప్పుకునే ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, గడిచిన ఐదేళ్లలో దాని గురించి ఎందుకు పట్టించుకోలేదో నియోజకవర్గ ప్రజలకు సమాధానం చెప్పాలి.

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ



బాహుదాను జల్లెడ పట్టేశారు...

అధికార మదంతో సహజ వనరులను వైసీపీ నాయకులు ఏ విధంగా దోచుకున్నారో చెప్పడానికి బాహుదా నది సజీవ సాక్ష్యం. నియోజకవర్గంలోని వాల్మీకిపురం, కలికిరి, కలకడ మండలాల్లో ప్రవహిస్తున్న బాహుదా పరీవాహక ప్రాంతంలో అధికార పార్టీ నేతలు చోటా మోటా నాయ కుల దగ్గర నుంచి సాక్షాత్తు మంత్రి వరకు ఇసుకను దోచుకున్నారు. ఇక్కడి నుంచి బెంగళూరు, చెన్నై నగరాలకు ఇసుక రవాణా చేసి కోట్లు సంపాదించుకున్నారు. వారి దుశ్చర్యల కారణంగా వాల్మీకిపురం, కలకిరి, కలకడ మండలాల్లో తీవ్రమైన తాగునీటి ఎద్దడి నెలకొంది. నిబంధనలకు విరుద్ధంగా ఇష్టా రీతిన ఇసుక కోసం తవ్వకాలు జరపడంతో అనేక చెక్ డ్యాంలు సైతం తెగిపోయి వేలాది రైతుల బోరు మోటార్లు ఎండిపోయాయి. భారీ గోతుల్లో పడి పదుల సంఖ్యలో ప్రజలు ప్రాణాలు కోల్పోయారు. అయినా అధికార పార్టీ నాయకులు ఇప్పటికీ బాహుదా పరీవాహక ప్రాంతాల్లో అక్రమంగా ఇసుక దందా సాగిస్తున్నారు. దీంతో ఆ ప్రాంత రైతులు రాబోయే ఎన్నికల్లో వైసీపీకి బుద్ధిచెప్పనున్నారు.

ఝరికోన నిర్వహణ నిర్వీర్యం

నియోజకవర్గంలోని కలికిరి, కలకడ, కేవీపల్లె మండలాల ప్రజలకు శాశ్వతంగా పుష్కలమైన తాగునీరు అందించాలన్న లక్ష్యంతో కేవీపల్లె మండలంలో ఝరికోన ప్రాజెక్టు నిర్మించా. అప్పట్లో కడప జిల్లా నాయకులతో విభేదించి పీలేరు నియోజకవర్గానికి తాగునీటి కోసం ఈ ప్రాజెక్టు తెచ్చుకున్నాం. ఝరికోన వద్ద ఉన్న ప్రాజెక్టు నుంచి నీటిని సేకరించి గువ్వలగుడ్డం వద్దనున్న ఫిల్టర్ల వద్ద శుద్ధి చేసి మూడు మండలాల్లోని ఓవర్ హెడ్ ట్యాంకుల ద్వారా సురక్షిత తాగునీరు అందించడం ప్రాజెక్టు ప్రత్యేకత. ఆ ప్రాజెక్టు నిర్వహ ణను వైసీపీ ప్రభుత్వం గాలికి వదిలేసింది. మేము అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రాజెక్టును సక్రమంగా నిర్వ హించి మూడు మండలాల్లో తాగునీటి సమస్య లేకుండా చేస్తాం.

పరిశ్రమలను గాలికొదిలేశారు

పీలేరు నియోజకవర్గంలోని వేలాది మంది నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలన్న లక్ష్యంతో పీలేరు, కలికిరి, వాల్మీకిపురం మండలాల్లో పరిశ్రమలు స్థాపనకు ఏపీఐఐసీ ద్వారా పెద్దఎత్తున భూసేకరణ జరిపాం. మా తరువాత వచ్చిన, ఎంపీ, ఎమ్మెల్యేలు పరిశ్రమల గురించి ఒక్కసారి కూడా పట్టించుకోలేదు. ఐదేళ్లపాటు అధికారం అనుభవించిన వారు ఒక్క పరిశ్రమ కూడా తేలేకపోయారు. పైపెచ్చు పరిశ్రమల కోసం సేకరించిన భూములను హౌసింగ్ పథకం కోసం అడ్డగోలుగా వాడుకుంటున్నారు. పీలేరులోని 700 ఎకరాల ఏపీఐఐసీ భూముల్లో సుమారు 100 ఎకరాలు హౌసింగ్ కోసం తీసేసుకున్నారు. వైసీపీ నాయకులు ఆక్రమించుకున్న 600 ఎకరాల్లో పేదలకు ఇళ్ళ స్థలాలు ఇవ్వాలని తాను డిమాండు చేస్తున్నా దాన్ని కాదని ఏపీసీసీ భూములను కేటాయించడం యువత భవిష్యత్తుకు అవరోధంగా మారింది. కలికిరిలోనూ ఇదే విధంగా ప్రయత్నించారు. స్థానికులు అడ్డుకోవడంతో ఆ ప్రయత్నాలను విరమించుకున్నారు. అభివృద్ధిపై ఎటువం టి ధ్యాసా లేని ఎంపీ, ఎమ్మెల్యే కారణంగానే నియోజక వర్గంలో పరిశ్రమలు లేకుండా పోయాయి.

యథేచ్ఛగా భూ ఆక్రమణలు

2019లో అధికారంలోకి వచ్చాక వైసీపీ నాయకులు ప్రభుత్వ, డీకేటీ భూములను ఆదాయ వనరుగా మార్చుకుని నియోజకవర్గంలోని మారుమూల ప్రాంతాల్లో కూడా భూ ఆక్రమణలకు పాల్పడ్డారు. పీలేరు పట్టణానికి ఆనుకుని ఉన్న బోడుమల్లువారిపల్లె, గూడరేవుపల్లె, దొడ్డిపల్లె, ఎర్రగుంటపల్లె పంచాయతీల్లో సుమారు రూ.400 కోట్ల విలువజేసే 600 ఎకరాలను ఆక్రమించుకు న్నారు. వాటిపై నేను పోరాటం చేస్తే అప్పటి మదనపల్లె సబ్-కలెక్టర్ జాహ్నవి నేతృత్వంలో విచారణ జరిపి అది నిజమని నిర్ధారించారు. అక్రమార్కులపై చర్యలు తీసు కోవాల్సిందిపోయి ఆమె ను బదిలీ చేశారు. ఎంపీ మిథున్‌రెడ్డి, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి కలిసి తూతూ మంత్రంగా కొంత మంది అధికారులను బదిలీ చేసి చేతులు దులుపుకున్నారు. ఆ రోజు నుంచి పీలేరు ప్రాం తంలో ఎక్కడో ఒకచోట అధికార పార్టీ నేతలు ఆక్రమణలకు పాల్పడుతూనే ఉన్నా రు.

ఆయిల్ సీడ్స్ ఫ్యాక్టరీనీ వదల లేదు

ఒకప్పుడు రాయలసీమకే తలమానికం గా ఉన్న పీలేరులోని ఆయిల్ సీడ్స్‌నూ అధి కార పార్టీ నేతలు వదలలేదు. మంత్రి, ఎమ్మెల్యేల అనుంగు అనుచరులు ఎంతో విలువైన ఆయిల్ సీడ్స్ భూములనూ ఆక్ర మించుకుని అక్రమంగా ఇళ్లు నిర్మించుకు న్నారు. ప్రస్తుత జేసీ ఫర్మాన్ అహ్మద్ వాటిని పరిశీలించి అక్రమ కట్టడాలుగా తేల్చినప్పటికీ ఎటువంటి చర్యలు తీసుకో లేదు. ప్రజా అవసరాలకు ఉపయోగపడా ల్సిన భూమిని సొంత అవసరాలకు వాడు కున్నారు. మేము అధికారంలోకి వచ్చిన వెంటనే అక్రమ నిర్మాణాలు జరిపిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం.

సమస్యల లోగిళ్లుగా జగనన్న కాలనీలు

నియోజకవర్గంలోని జగనన్న కాలనీలు సమస్యల లోగిళ్లుగా ఉన్నాయి. నియోజకవర్గంలోని ఒక్క లే-ఔట్‌లో కూడా సం పూర్ణంగా ఇళ్ల నిర్మాణం పూర్తి కాలేదు. అధిక శాతం కాలనీ లు రాళ్లు, రప్పలు, గుట్టల్లో మంజూరు చేయడంతో చాలా మంది లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణానికి ఆసక్తి చూపడం లేదు. కాలనీల్లో మౌలిక వసతుల కల్పనపై ఎంపీ, ఎమ్మెల్యేలు ఏనాడూ దృష్టి సారించలేదు. ఇళ్లు కట్టుకున్న అరకొరా లబ్ధిదారులకు బిల్లులు చెల్లించడం లేదు. అయితే మేము పాత వాల్మీకిపురం నియోజకవర్గం లోని కలికిరి, కలకడ, వాల్మీకిపురం, గుర్రంకొండ మండలా ల్లో అప్పటి ఇందిరమ్మ కాలనీలను జాతీయ రహదారులకు ఆనుకుని ఏర్పాటు చేసి మౌలిక వసతులు కల్పించాం. దాం తో ఆ కాలనీలు ఎంతగానో అభివృద్ధి చెందాయి.

అసంపూర్తిగా వాల్మీకిపురం సబ్-జైలు, ఫైర్ స్టేషన్

మా అన్న సీఎంగా ఉన్నప్పుడు మంజూరైన వాల్మీకిపురం సబ్-జైలు, ఫైర్ స్టేషన్ నూతన భవనాల నిర్మాణ పనులు దశాబ్ద కాలంగా అసంపూర్తిగా నిలిచిపోయాయి. జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న ఆ అసంపూర్తి కట్టడాలను అదే దారిలో అనునిత్యం ప్రయాణించే ఎంపీ, ఎమ్మెల్యేలు చూస్తూనే ఉన్నా వాటిని పూర్తి చేసేందుకు ఎటువంటి చర్యలు తీసుకోరు. దాన్ని బట్టి అభివృద్ధి పట్ల వారికున్న నిబద్ధత అర్థం చేసుకోవచ్చు. తన సొంత ఊరిలో అసంపూర్తిగా ఉన్న పనులను పూర్తి చేసుకోలేని నిస్సహాయస్థితిలో ఎమ్మెల్యే ఉండడం నిజంగా దయనీయం.

కలగా రాజీవ్ నగర్ కాలనీ ఫుట్ ఓవర్ బ్రిడ్జి

పీలేరు పట్టణంలోని రాజీవ్ నగర్ కాలనీ వాసుల చిరకాల వాంఛ అయిన ఫుట్ ఓవర్ బ్రిడ్జి కూడా ఈ ఎంపీ, ఎమ్మెల్యేలు పట్టించుకోలేదు. మా అన్న సీఎంగా ఉన్నప్పుడు ఫుట్ ఓవర్ బ్రిడ్జిని మంజూరు చేయిస్తే తాము అధికారంలోకి వస్తే భారీ బ్రిడ్జి నిర్మిస్తామని అప్పట్లో వైసీపీ నాయకులు ప్రజలకు ఆశ కల్పించారు. గత ఐదేళ్లుగా అధికారంలో ఉన్నప్పటికీ వారు దాని గురించి పట్టించుకోలేదు. మేము అధికారంలోకి వచ్చిన వెంటనే రైల్వే అధికారులతో సంప్రదించి దానిని నిర్మాణం ప్రారంభిస్తాం.

మేడికుర్తి ప్రాజెక్టు కింద 'మేడి' పట్టని రైతులు

మేడికుర్తి సమీపంలోని బాహుదా నదికి అడ్డంగా ప్రాజెక్టు నిర్మించేందుకు అప్పటి టీడీపీ ప్రభుత్వం రూ.6 కోట్ల నిధులు మంజూరు చేసింది. 4400 ఎకరాల ఆయుకట్టుకు నీరందించడానికి 12 కిలోమీటర్ల పొడవు ఎడమ కాలువ, 16 కిలోమీటర్ల కుడి కాలువల నిర్మాణానికి విడిగా పనులు చేపట్టారు. ఆ పనులు దక్కించుకుంది ప్రస్తుత మంత్రి, అప్పటి పీలేరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి. అయితే రెండు కాలువలనూ నిర్మించకుండా పనులు అర్థాంతరంగా ఆపేశారు. అరకొరగా 2003లో ప్రాజెక్టును పూర్తి చేశామనిపించారు. నిర్మించిన నాటి నుంచి లీకేజీలతో సతమతమైన ఆ ప్రాజెక్టులో ఏనాడూ నీళ్లు నిలిచింది లేదు.

నాలుగు లేన్ల రహదారులపైనా అసత్య ప్రచారాలు

పీలేరు నియోజకవర్గం గూండా సాగుతున్న నాలుగు లేన్ల జాతీయ రహదారులపైన కూడా ఈ ఎంపీ, ఎమ్మెల్యేలు అసత్య ప్రచారాలు చేస్తున్నారు. 2014-19 మధ్య చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఆ ప్రాజెక్టుకు భూసేకరణ జరిగింది. కేంద్ర ప్రభుత్వ అధీనంలో ఎన్‌హెచ్ఏఐ సంస్థ పచ్చజెండా ఊపిం ది. ఆ పనులను తామే సాధించామని అబద్దాలు చెప్పడం వారికే చెల్లింది. అంతే కాకుండా పీలేరు పట్టణంలో ప్రస్తుతం నిర్మితమవుతున్న ఆర్‌వోబీలు . కిరణ్ కుమార్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడే అవి మంజూరయ్యాయి.

నిర్లక్ష్యానికి టమో'రా'

ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని పడమటి మండలాల టమోటా వ్యాపారానికి గతంలో పీలేరు నియోజకవర్గంలో గేట్ వే లా ఉండేది. పీలేరు నియోజకవర్గంలోని కలికిరి, వాల్మీకిపురం, చింతపర్తి, గుర్రంకొండ టమోటా మార్కెట్లు అనునిత్యం రైతులు, కొనుగోలుదారులు, బయటి రాష్ట్రాల వ్యాపారులతో కిటకిటలాడుతూ ఉండేవి. వాటి భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని చింతపర్తి, కలికిరి, గుర్రంకొండ, వాల్మీకిపురం మార్కెట్‌లను ఆధునికీకరించాం. అయితే టమోటా రైతులను ఆదుకునేందుకు నియోజకవర్గలో టమోటా ప్రాసెసింగ్ యూనిట్లు, కోల్డ్ స్టోరేజ్‌లను ఏర్పాటు చేస్తా మని గత ఎన్నికల సందర్భంగా హామీలు గుప్పించిన ఎంపీ, ఎమ్మెల్యేలు దాన్ని పట్టించుకోలేదు. మేము అధి కారంలోకి వచ్చిన వెంటనే ఈ ప్రాంత రైతులను ఆదుకుంటాం.

రాజకీయమంటే ప్రజాసేవ, వ్యాపారం కాదు

మా కుటుంబానికి రాజకీయం అంటే ప్రజాసేవ, అభివృద్ధి. దశాబ్దాలుగా అదే సిద్ధాంతంతో రాజకీయాలు సాగించి అటు పాత వాయల్పాడు, ఇటు కొత్త పీలేరు నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశాం. మాకు దక్కిన మూడున్నరేళ్ల ముఖ్యమంత్రి పదవి ద్వారా నియోజకవర్గాన్ని పూర్తిగా అభివృద్ధి చేయగలిగాం. అయితే ప్రస్తుత ఎంపీ, ఎమ్మెల్యే ప్రజల అవసరాలను గాలికి వదిలేసి తమ జేబులు నింపుకుంటున్నారు. దీంతో నియోజకవర్గం పాతికేళ్ళు వెనక్కి వెళ్లింది. నియోజకవర్గ అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని నాకు ఒక్కసారి అవకాశం ఇస్తే సమస్యలు పరిష్కరించి మరో మారు అభివృద్ధి పథంలో నడిపిస్తాను.

పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలు ఉండాలి

మదనపల్లె టౌన్, ఏప్రిల్ 4: ఎన్నికల పోలింగ్‌కేంద్రాల్లో ఓట ర్లకు అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిశోర్ ఆదేశించారు. గురువారం మదనపల్లె మండలం పప్పిరెడ్డిగారిపల్లె, రామసముద్రం మండల కేంద్రంలోని జడ్పీ హైస్కూల్లోని పోలింగ్ కేంద్రాలు కలెక్టర్ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో 1609 పోలింగ్ కేంద్రాలు వున్నాయని ఎన్నికల కమిషన్ ఆదేశాలతో పోలింగ్ కేంద్రాలకు నెంబర్లు వేయించడంతో పాటు, బీఎల్‌వోల సమాచారం అందుబాటులో వుంచుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ కృష్ణారావు, ఆర్డీవో హరిప్రసాద్, డీఎస్పీ ప్రసాదరెడ్డి, తహసీల్దార్ రమాదేవి, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడిపిన వారికి రూ.1.22లక్షలు జరిమానా

మదనపల్లె టౌన్, ఏప్రిల్ 4: మదనపల్లె పట్టణంలో మద్యం తాగి వాహనాలు నడిపిన 11 మందికి మదనపల్లె స్పెషల్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కోర్టు న్యాయాధికారి రూ.1.22 లక్షలు జరిమానా విధించారు. వన్‌టౌన్ సీఐ వల్లీబషు, టు టౌన్ స్టేషన్ సీఐ యువరాజు కథనం మేరకు..పట్టణంలో మద్యం తాగి వాహనాలు నడిపిన 11 మందిని గురువారం మెజిస్ట్రేట్ ప్రవీణ్ కుమార్ ఎదుట హాజరు పరిచారు. విచారించిన న్యాయాధికారి 11 మందికి రూ.1.22 లక్షల జరిమానా చెల్లించకుంటే మూడు నెలల జైలుశిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు.

పింఛన్ కోసం వెళ్లి వస్తూ.. ఇద్దరు వృద్ధులకు గాయాలు

మదనపల్లె టౌన్, ఏప్రిల్ 4: ఇద్దరు వృద్ధులు పింఛన్ల కోసం వెళ్లి వస్తూ రోడ్డు ప్రమాదాల్లో గాయపడ్డారు. గురువారం రామసముద్రం మండలం జంగాలపల్లెకు చెందిన వెంకటప్ప భార్య మునెమ్మ(67) పింఛన్ కోసం తన అల్లుడి ద్విచక్రవాహనంలో నడింపల్లె గ్రామ సచివాలయానికి వెళుతుండగా మార్గమధ్యంలో మునెమ్మ కాలు ద్విచక్రవాహనం వెనుక చక్రంలో ఇరుక్కోవడంతో కిందపడిపోయారు. దీంతో ఆమె కాలుకు తీవ్ర గాయం కావడంతో మదనపల్లె ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అలాగే కురబలకోట మండలం అంగళ్లు గ్రామం ఇందిరాపురంకు చెందిన సిలార్‌సాబ్ భార్య జహీరాబి(70) గ్రామ సచివాలయానికి వెళ్లి పింఛన్ తీసుకుని ఆ డబ్బుతో సంతకి వెళుతుండగా మార్గమధ్యంలో వేగంగా వచ్చిన ఆటో ఢీకొంది. తీవ్రంగా గాయపడిన ఆమెను మదనపల్లె ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

ఇద్దరు వలంటీర్ల తొలగింపు

గుర్రంకొండ, ఏప్రిల్ 4:ఎన్నికల నియమావళిని ఉల్లంఘించిన ఇద్దరు వలంటీర్లను విధుల నుంచి గురువారం తొలగించినట్లు ఎంపీడీవో జగదీశ్వర్‌రెడ్డి తెలిపారు. గుర్రంకొండ పట్టణంలోని కొత్తపేటకు చెందిన శ్రీజ అనే వలంటీర్ వైసీపీకి మద్దతుగా వలంటీర్ గ్రూప్‌లో పోస్టు పంపింది. అలాగే సరిమడుగు పంచాయితీకి చెందిన వలంటీర్ ప్రేమ్‌కుమార్ సిద్ధం సభకు వెళ్లాడు. వలంటీర్ల కోడ్ ఉల్లంఘనను క్షేత్రస్థాయిలో ఎంపీడీవో విచారించారు. అనంతరం వారిద్దరు ఎన్నికల కోడ్ ఉల్లంఘించినట్లు నిర్ధారణ కావడంతో విధుల నుంచి తొలగించినట్లు ఎంపీడీవో తెలిపారు.

నిర్భయంగా ఓటు హకు వినియోగించుకోండి

నిమ్మనపల్లి, ఏప్రిల్ 4: సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు నిర్భయంగా వారి ఓటు హక్కును వినియోగించుకోవాలని జిల్లా ఎస్పీ కృష్ణారావు పేర్కొ న్నారు. గురువారం స్థానిక పోలీస్‌స్టేషన్‌ను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సమస్యాత్మక కేంద్రాలను గుర్తించి ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఆయన వెంట డీఎస్పీ ప్రసాద్‌రెడ్డి సీఐలు సద్గురుడు, నాగేశ్వర్, ఎస్ఐ లోకేష్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

పింఛన్ కోసం వృద్ధుల నరక యాతన

బి. కొత్తకోట, ఏప్రిల్4: పింఛన్ సొమ్ము పొందడం కోసం వృద్ధులు, దివ్యాంగులు నరకయాతన అనుభవించారు. నగరపంచాయతీ పరిధిలోని తాకాటంవారిపల్లె, ఆలేటిపల్లె, ఊజార్లపల్లె తదితర పల్లెల నుంచి వచ్చిన వృద్ధులు ఈ నెల 3న పింఛన్లు ఇస్తారంటూ ప్రకటించడంతో ఆయా సచివాలయాల వద్దకు చేరుకుని సాయంత్రం దాకా నిరీక్షించినా ఫలితం లేకుండా పోయింది. నగదు రాలేదంటూ సిబ్బంది పంపిణీ చేయనేలేదు. దీంతో చేసేదిలేక తమ ఇళ్లకు వెనుదిరిగారు. గురువారం ఉదయాన్నే పెద్దసంఖ్యలో సచివాలయాల వద్దకు చేరుకోవడంతో రద్దీ ఏర్పడింది. అన్నిసచివాలయాల లోనూ పంచాయతీ కార్యదర్శి మాత్రమే కాకుండా సచివాలయ సిబ్బందికి సైతం లాగిన్ ఇవ్వడంతో పంపిణీ ప్రక్రియ కొనసాగింది. మండలంలో 8057 మంది లబ్ధిదారులు వుండగా వీరిలో 7172 మందికి పంపిణీ పూర్తి అయినట్టు ఎంపీడీవో నూర్జహాన్ తెలిపారు.

పింఛన్ల పంపిణీ పారదర్శకంగా చేయాలి

కురబలకోట, ఏప్రిల్ 4: పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిశోర్ పేర్కొన్నారు. గురువారం మండలంలోని అంగళ్లులో పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమలులో ఉండటంతో పింఛన్‌దారులకు గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది ద్వారా రాలేని వారికి వారి ఇంటివద్దకే వెళ్లి ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం 75శాతం పింఛన్లు పంపిణీ చేశామన్నారు. అనంతరం పింఛన్‌దారులతో మాట్లాడి ఎలా పంపిణీ చేస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆర్డీవో హరిప్రసాద్, తహశీల్దార్ ఈశ్వరమ్మ, ఎంపీడీవో హరినారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆప్తులకు మాజీ సీఎం నల్లారి కిరణ్ పరామర్శ

వాల్మీకిపురం, ఏప్రిల్ 4: వాల్మీకిపురం మండలం చింతపర్తి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ గట్టుగాళ్ల రమణయ్య ఇంటికి వెళ్లి మాజీ సీఎం నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి బుధవారం రాత్రి పరామర్శించారు. స్థానిక బీఆర్ మహల్ యజమాని ఉత్తారెడ్డి అనారోగ్యంతో బాధపడుతుండగా ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించారు. కార్యక్రమంలో మాజీ సీఎం తనయుడు నల్లారి నిఖిలేష్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ కంభం నిరంజన్‌రెడ్డి, సర్పంచ్ మహిత శేషాద్రిరెడ్డి, నాయకులు ద్వారకనాథ రెడ్డి, కాంతరాజు, భాస్కర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, చంద్రారెడ్డి, కువైట్ ఆది, వెంకటేష్, బాలాజీ, శివ, చిరంజీవి, భాస్కర్ పాల్గొన్నారు.

ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోండి

పెద్దమండ్యం, ఏప్రిల్ 4: వేసవిలో ఉపాధి పనులను కూలీలు సద్వినియోగం చేసుకోవాలని పెద్దమండ్యం ఎంపీడీవో వెంకటరమణయ్య పేర్కొన్నారు. మండలంలోని సిద్దవరంలో జరుగుతున్న ఉపాధి పనులను గురువారం అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా కూలీలు, ఉపాధి సిబ్బందితో మాట్లాడుతూ కరువు ప్రభావం వల్ల మండలంలో ప్రతి కూలీకి పనులు కల్పించాలన్నారు.

చింతపర్తిలో పోలీసుల కార్డెన్‌సెర్చ్

వాల్మీకిపురం, ఏప్రిల్ 4: వాల్మీకిపురం మండలం చింతపర్తి గ్రామంలో పోలీసుల కార్డెన్‌సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్మాణ పనులు ఆగిపోయి ఉన్న ఓ పాడుబడ్డ నివాసంలో రహస్యంగా దాచిన 50 లీటర్ల నాటు సారాను సీజ్ చేసి సంబంధిత వ్యక్తి వివరాలను ఆరా తీశారు. ఈ సందర్భంగా సీఐ పులి శేఖర్ ఆ ప్రాంత ప్రజలకు కౌన్సెలింగ్ నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్ఐ నాగేశ్వర్‌రావ్, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులు, సిబ్బంది, పాల్గొన్నారు.



గ్రామస్థులకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ పులి శేఖర్

బీసీల సంక్షేమమే టీడీపీ అజెండా

● తంబళ్లపల్లె కూటమి అభ్యర్థి దాసరిపల్లె జయచంద్రారెడ్డి



జయహో బీసీ కార్యక్రమంలో డిక్లరేషన్ కరపత్రాలను ఆవిష్కరిస్తున్న జయచంద్రారెడ్డి, నాయకులు

పెద్దతిప్పసముద్రం ఏప్రిల్ 4 : బీసీల అభివృద్ధి, సంక్షేమమే టీడీపీ అజెండా అని తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి దాసరిపల్లె జయచంద్రారెడ్డి అన్నారు. గురువారం కందుకూరులో నియోజకవర్గ ప్రచార సమన్వయ కర్త సీడ్ మల్లికార్జున నాయుడు, టీడీపీ మండల అధ్యక్షుడు ఆనంద్‌రెడ్డిల ఆధ్వర్యంలో జయహో బీసీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జయచంద్రారెడ్డి మాట్లాడుతూ మన ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపరిచిన బీసీ డిక్లరేషన్ అంశాలను ప్రతి ఇంటికి వెళ్లి సవివరంగా వివరించాలని కోరారు. అంతకు ముందు మండలంలోని బాగేపల్లె, వడ్డిపల్లె, పాతకందుకూరు, నిలువురాతిపల్లె, గొల్లపల్లె, గొడుగువారిపల్లె, అగ్రహారం గ్రామాల్లో బాబు ష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారంటీ, సూపర్ సిక్స్ పథకాలను కరపత్రాల ద్వారా ఇంటింటికి తిరుగుతూ తంబళ్లపల్లె నియో జకవర్గం ఉమ్మడి అభ్యర్థినైన తనను, రాజంపేట పార్లమెంట్ ఎంపీ అభ్యర్థి అయిన బీజేపీ అభ్యర్థి నల్లారి కిరణ్‌కుమార్ రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. సింగిల్ విండో మాజీ ఛైర్మన్ సంపతికోట కిట్టన్న, మండల టీడీపీ అధ్యక్షుడు ఆనంద్‌రెడ్డి, ములకలచెరువు మండల అధ్యక్షుడు పాలగిరి సిద్దా, తంబళ్లపల్లె నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు చెన్నకృష్ణ, ఆదిమూర్తి, శీన, రామాంజులు, మాజీ ఎంపీటీ చిన్నా, రాము, కుందిలి వెంకటరెడ్డి, కందుకూరు పణి, బాబు, నాగరాజు, అగ్రహారం శ్రీనివాసులు ఉన్నారు.

టీడీపీతోనే బీసీల అబివృద్ధి సాధ్యం

ములకలచెరువు, ఏప్రిల్ 4: టీడీపీతోనే బీసీల అభివృద్ధి సాధ్యమని తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఉమ్మడి అభ్యర్థి దాసరిపల్లి జయచంద్రారెడ్డి పేర్కొన్నారు. ములకలచెరువులో గురువారం రాజంపేట పార్లమెంటు నియోజకవర్గ నగర సాధికార సమితి కన్వీనర్ తలపాక వేణుగోపాల్, నేతలు కట్టా హరినాద్, నాగరాజు, లక్ష్మినారాయణలు ఉమ్మడి అభ్యర్థి జయచంద్రారెడ్డిని కలిసి మద్దతు ప్రకటించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు పాలగిరి సిద్దా, బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు చెన్నకిష్టా, నగర సాధికార సమితి నాయకులు సాయిప్రతాప్, రామకృష్ణ, వెంకటరామయ్య, రెడ్డెప్ప, చెన్నకేశవులు, బాలాజీ, ధన తదితరులు పాల్గొన్నారు.

ఐదుగురు వైసీపీ వార్డు మెంబర్లు టీడీపీలో చేరిక

మదనపల్లె టౌన్, ఏప్రిల్ 4: మదనపల్లె మండలం పోతబోలు పంచాయతీలో వైసీపీకి చెందిన ఐదుగురు వార్డు సభ్యులు పఠాన్‌ఖాదర్‌ఖాన్ ఆధ్వర్యంలో ఉమ్మడి కూటమి అభ్యర్థి షాజహాన్‌బాషా సమక్షంలో టీడీపీలో చేరారు. 300 మంది టీడీపీ శ్రేణులు వెంటరాగా శ్రీనివాసులు, రఘు, రెడ్డెప్పతోపాటు 13 గ్రామాలకు చెందిన ప్రజలు రోడ్డుషోలో పాల్గొన్నారు. మాజీ సర్పంచ్ పఠాన్ ఖాదర్‌ఖాన్ ఆధ్వర్యంలో షాజహాన్‌బాషాకు ఘన స్వాగతం లభించింది.

రాజకీయ లబ్ధి కోసమే ప్రతిపక్షంపై ఆరోపణలు

నిమ్మనపల్లి, ఏప్రిల్ 4: రాజకీయ లబ్ధికోసమే వైసీపీ ప్రభుత్వం టీడీపీపై లేని పోని ఆరోపనలు చేస్తోందని టీడీపీ అధికార ప్రతినిధి ఆర్వే వెంకటేష్ ధ్వజమెత్తారు. గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వంలో పంచాయతి కార్యదర్శి ఒక్కరే ఫింఛన్‌లు ఇచ్చేవారని తెలిపారు. ఎన్నికల కమిషన్ తీసుకొన్న నిర్ణయాలను కూడా టీడీపీపై రుద్దడం దారుణమన్నారు. ఫింఛన్లు ఇచ్చేందుకు డబ్బులు లేక ప్రతిపక్షంపై బురద చల్లుతున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో గ్రామకమిటీ అధ్యక్షుడు మల్లికార్జున, మనోహర్‌రెడ్డి, రాజన్న, శివకృష్ణ తదితరులు పాల్గొన్నారు.


పొత్తుపై వైసీపీ విషప్రచారాన్ని తిప్పికొట్టండి

పీలేరు, ఏప్రిల్ 4: టీడీపీ, జనసేన, బీజేపీ పొత్తుపై వైసీపీ చేస్తున్న విషప్రచారాన్ని సమర్థవంతంగా తిప్పికొట్టాలని కూటమిలోని మైనారిటీ శ్రేణులకు టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం ఆయన పీలేరులోని టీడీపీ కార్యాలయంలో ముస్లిం మైనారిటీలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఎన్‌డీఏ భాగస్వామిగా ఉన్నప్పుడు బీజేపీ నాయకులను ఒప్పించి అబ్దుల్ కలాంను రాష్ట్రపతిగా ఎంపిక చేయడమే కాకుండా గెలిపించుకున్న ఘనత చంద్రబాబుదేనన్నారు. 2014-19 మధ్యకాలంలో బీజేపీతో పొత్తు ఉన్నప్పటికీ రాష్ట్రంలోని ఇమామ్, మౌజన్‌లకు గౌరవ వేతనాలు ప్రవేశపెట్టిన విషయం ముస్లింలు గుర్తు చేసుకోవాలన్నారు.

వైసీపీ నాయకులు ముస్లింలకు క్షమాపణలు చెప్పాలి

ఎన్‌ఆర్‌సీ, సీఏఏ, త్రిపుల్ తలాక్ వంటి బిల్లులకు పార్లమెంటులో మద్దతు తెలిపిన వైసీపీ నాయకులు రాష్ట్రంలోని ముస్లింలకు క్షమాపణలు చెప్పిన తరువాతనే ఓట్లు అభ్యర్థించాలని విశ్రాంత సబ్-జడ్జి ఇంతియాజ్ అహ్మద్ తెలిపారు. మైనారిటీ సదస్సులో ఆయన మాట్లాడుతూ ముస్లింలపై వల్లమాలిన ప్రేమ చూపుతున్న వైసీపీ నాయకులు గడిచిన ఐదేళ్ల కాలంలో రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 190 మంది ముస్లిం మైనారిటీలపై దాడులు జరిగిన విషయంపై సమాధానం చెప్పాలన్నారు. పవిత్ర రమజాన్ మాసం సందర్భంగా పీలేరు పట్టణంలోని సుమారు 2 వేల మంది ముస్లింలకు రమజాన్ తోఫా అందించిన పీలేరు మాజీ వైఎస్-ఎంపీపీ పోలిశెట్టి సురేంద్రను నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అధికార భాషా సంఘం మాజీ సభ్యులు వేంపల్లె అబ్దుల్ ఖాదర్, నాయకులు నౌషాద్ అహ్మద్, ఎజాజ్ అహ్మద్, మల్లెల రెడ్డిబాషా, షౌకత్ అలీ, పూల అన్వర్ బాషా, నిజాముద్దీన్, వాల్మీకిపురం డిష్ బ్రదర్స్, కలకడ జీలానీ బాషా తదితరులు పాల్గొన్నారు.

నీరుగట్టువారిపల్లె నుంచి టీడీపీలో భారీగా చేరిక



టీడీపాలో చేరిన వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న షాజహాన్‌బాషా

మదనపల్లె టౌన్, ఏప్రిల్ 4: పట్టణంలోని నీరుగట్టువారిపల్లెలో చేనేత కార్మికసంఘం నాయకుడు టి.లోకేశ్ ఆధ్వర్యంలో 100 మంది కార్మికులు, యువత టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి షాజహాన్‌బాషాను సన్మానించి టీడీపీలో చేరారు. గురువారం పట్టణంలో ఇంటింటికి తిరుగుతూ సూపర్ సిక్స్ కరపత్రాలు పంచుతూ ప్రజలకు చంద్రబాబు హామీలను వివరించారు. కోళ్లబైలు వైసీపీ వార్డు సభ్యురాలు భర్త రమణప్ప, చంద్ర, సురేంద్ర, రెడ్డెప్ప, పారేశు టీడీపీలో చేరారు. బెంగళూరు బస్టాండు, కదిరిరోడ్డు పక్కన తోపుడు బళ్ల వ్యాపారులతో షాజహాన్‌బాషా మాట్లాడారు. కొత్తపల్లె రాంబాబు షాజహాన్‌బాషా గెలుపొందాలని ఒక పాటను రచించి, పాడించి రికార్డింగ్ చేసి షాజహాన్‌బాషాకు బహుమతిగా అందజేశారు. కార్యక్రమాల్లో మున్సిపల్ మాజీ ఛైర్మన్ కొడవలి శివప్రసాద్, టౌన్‌బ్యాంకు మాజీ ఛైర్మన్ విద్యాసాగర్, నాదెళ్ల శివన్న, మున్సిపల్ మాజీ కౌన్సిలర్లు బాబునాయుడు, టీడీపీ నాయకులు ఆర్‌కే రామకృష్ణాచారి, సుమంత్ కళ్యాణ్, సోమశేఖర్, శ్రీరామ వినోద్, నవీన్, జేసీబీ ఈశ్వర్‌నాయుడు, మధు, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీతోనే బలిజ, కాపులకు న్యాయం



బలిజ, కాపుసంఘం నేత ప్రసాద్‌కుమార్‌తో షాజహాన్‌బాషా

మదనపల్లె, ఏప్రిల్ 4: టీడీపీతోనే బలిజ, కాపులకు అన్ని విధాలా న్యాయం జరుగుతుందని మదనపల్లె ఉమ్మడి అభ్యర్థి ఎం.షాజహాన్‌బాషా పేర్కొన్నారు. స్థానిక బలిజసంఘం రాష్ట్రఅధ్యక్షుడు, రాయల్ యూత్ ప్రెసిడెంట్ రేగడి ప్రసాద్‌కుమార్ నివాసానికి గురువారం విచ్చేసిన షాజహాన్‌బాషా..ఎన్నికల్లో మద్దతు తెలపాలని కోరారు. ఈ సందర్భంగా బలిజసంఘం అంతా టీడీపీ అభ్యర్థి ఎం.షాజహాన్‌బాషా, రాజంపేట పార్లమెంటు అభ్యర్థి, మాజీ సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి వెంటనడుస్తామని, వచ్చే ఎన్నికల్లో అత్యధిక మెజారిటీతో గెలిపించుకుంటామని ప్రసాద్‌కుమార్ ప్రకటించారు. దీంతో అక్కడున్న ఆ సంఘం సభ్యులంతా ఆమోదం తెలపడంతో ఇప్పటికప్పుడే అభ్యర్థి వెంట..ఇంటింటా ప్రచారంలో పాల్గొన్నారు. సమావేశంలో టీడీపీ సీనియర్ నాయకురాలు కాంతమ్మ, నాయకులు ఆర్.రెడ్డెప్ప, సీనియర్ సిటిజన్ ప్రెసిడెంట్ మునిగోపాలకృష్ణ, ధనలక్ష్మి, సుంకర రామచంద్ర, పసుపులేటి వరప్రసాద్, ఆంజనేయులు, స్వరూపా, శ్యామల, గుల్నాజ్, రవిళి, వేమనారాయణ, జయరామ్, నాగరాణి, వాణి, ఉమారాణి, చంద్రశేఖర్, మల్లికార్జున, జ.శ్రీధర్‌బాబు, ఎం.దివ్య, బి.లక్ష్మినారాయణ, తదితరులు పాల్గొన్నారు.